

మన జనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి...

తెలుగు దినపత్రిక

సంపుటి : 6 | సంచిక : 285 | పేజీలు : 8 | వెల : రూ.2/- ఆదివారం 08 నవంబర్ 2026 వైయస్ఆర్ కడప

Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool



పల్లెల్లోనూ తగ్గని కూటమి జోరు

భారీ మెజార్టీతో జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలు కైవసం

అమరావతి, మన జనప్రగతి నవంబర్ 07:
పట్టణ స్థానిక సంస్థల్లో క్లీన్‌స్వీప్ చేసిన కూటమి పరిషత్ పోరులోనూ హవా సాగించింది. భారీ మెజార్టీతో జిల్లా, మండల పరిషత్ స్థానాలను కైవసం చేసుకుంది. ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సింగిల్ డిజిట్‌కే పరిమితం కావాల్సి వచ్చింది. గత రెండున్నరేళ్ల కూటమి పాలన పట్ల ప్రజలు మరోసారి విశ్వసనీయత చాటుకున్నారనేందుకు ఈ ఎన్నికలు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

ఈ నెల 5, 6 తేదీల్లో జరిగిన జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికలకు పోలింగ్ జరిగింది. మొత్తం 659 జెడ్పీటీసీ స్థానాలకు గాను 77 ఏకగ్రీవం కాగా 582 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఎంపీటీసీలు మొత్తం 9,818 కాగా 2,051 స్థానాలు ఏకగ్రీవం కాగా 7,707 ఎంపీటీసీ పదవులకు ఎన్నికలు జరిగాయి.

శనివారం ఓట్ల లెక్కింపు అనంతరం ఫలితాలు ప్రకటించారు. కౌంటింగ్ సందర్భంగా పలు ప్రాంతాల్లో ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. **మిగతా 2లో...**



జగన్‌కు షాక్..
చేజారిన జెడ్పీ పీఠం

- శ్రీకాకుళం నుంచి చిత్తూరు దాకా ప్రభంజనం
- పల్నాడు, అనకాపల్లి జిల్లాల్లో కూటమి స్వీప్
- పులివెందులలో పసుపు జెండా రెపరెపలు
- జగన్ మేనత్త ఊళ్లోనూ ఫ్యాన్‌కు ఎదురుదెబ్బ
- మిశ్రమ ఫలితాలు.. పలుచోట్ల ఆసక్తికర పరిణామాలు

టీడీపీ పాలన ఎమర్జెన్సీని తలపిస్తోంది

ఎమ్మెల్సీపై డెకాయిటీ కేసులా?
: చంద్రబాబు సర్కారుపై జగన్ ఫైర్

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అరెస్టును ఖండించిన జగన్

బ్యాలెట్ బాక్సుల తరలింపును ప్రశ్నించినందుకు అరెస్టు చేశారని ఆరోపణ



2లో.

ప్రపంచ పెట్టుబడులే లక్ష్యంగా ఏపీ ప్రభుత్వం

నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖలో 'సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్'


59 దేశాల నుంచి 1250 మందికి పైగా ప్రతినిధుల భాగస్వామ్యం

ఏపీలో పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా సీఎం చంద్రబాబు సమీక్ష

వాణిజ్యం, గ్రీన్ ఎనర్జీ సహా ఆరు కీలక రంగాలపై ప్రధానంగా చర్చలు

పారిశ్రామిక భాగస్వామ్యాల కోసం 400 బీటుబీ సమావేశాలు

విశాఖపట్నం/అమరావతి, మన జనప్రగతి నవంబర్ 07:
విశాఖపట్నం నగరం మరో ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ సదస్సుకు వేదిక కానుంది. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ఆధ్వర్యంలో 31వ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖలో జరగనుంది. 'నావిగేటింగ్ న్యూ వరల్డ్ ఆర్డర్: ట్రేడ్, టెక్నాలజీ, ట్రస్ట్' అనే థీమ్‌తో నిర్వహించే ఈ సదస్సులో 59 దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొననున్నారు. **మిగతా 2లో...**



సంక్రాంతి తర్వాత జిల్లాల్లో పర్యటిస్తా

ప్రాజెక్టుల్లో నీళ్లన్నీ తాగేందుకే.. రైతులకు సీఎం రేవంత్ కీలక హెచ్చరిక!

ఎల్‌నినోతో వర్షాభావ పరిస్థితులుంటాయని ప్రజలకు అప్రమత్తం

రైతులు ఆరుతడి పంటలే సాగు చేయాలని సూచన

గడ్డం పెంచుకున్నంత మాత్రాన తనలా మారలేరంటూ కేటీఆర్‌పై విమర్శలు



2లో.



ఈ 20 కాస్తా 420గా మారింది..

ఇంధన సంస్థలు ప్రజలను మోసం చేస్తున్నాయి: రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, మన జనప్రగతి నవంబర్ 07: దేశంలోని ప్రధాన చమురు మార్కెటింగ్ కంపెనీలు పెట్రోల్‌లో ప్రభుత్వం నిర్దేశించిన 20 శాతం పరిమితికి మించి ఇథనాల్ కలుపుతూ ప్రజలను మోసం చేస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత, **మిగతా 2లో...**

కొడంగల్ టెండర్లలో పొంగులేటి కంపెనీకి లబ్ధి

కొడంగల్ ఎత్తిపోతలలో భారీ అవకతవకలు జరిగాయన్న కేటీఆర్

రూ.1450 కోట్ల నుంచి రూ.6825 కోట్లకు ప్రాజెక్టు వ్యయాన్ని పెంచారని విమర్శ

ఇది క్రోనీ క్యాపిటలిజం, పగటి దోపిడీ అంటూ తీవ్ర విమర్శ

హైదరాబాద్ మన జనప్రగతి నవంబర్ 07: తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. కొడంగల్ -నారాయణపేట-మక్తల్ ఎత్తిపోతల పథకం టెండర్లలో భారీ అవకతవకలు జరిగాయని, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన కంపెనీకి అనుచిత లబ్ధి చేకూర్చారని ఆరోపించారు. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం 2014లో సుమారు రూ. 1,450 కోట్లుగా ఉండగా, దానిని ఇప్పుడు రూ. 6,825 కోట్లకు పెంచారని కేటీఆర్ విమర్శించారు.



మిగతా 2లో...

ఎమర్జెన్సీ పారపాటే..


దేశంలో ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించటం పారపాటే.. కానీ తప్పలేదు

సంజయ్‌గాంధీ ఒత్తిడితోనే ఆ నిర్ణయం

ద హిందూ, ద గార్డియన్ వార్తా సంస్థలకు ఇచ్చిన ఇంటర్వ్యూల్లో సోనియాగాంధీ

న్యూఢిల్లీ, మన జనప్రగతి నవంబర్ 07:
గత పన్నెండేళ్లలో దేశ సామాజిక నిర్మాణం, ప్రజాస్వామ్య వ్యవస్థలు, రాజ్యాంగ సంస్థలకు తీవ్ర నష్టం జరిగిందని కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ వ్యాఖ్యానించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ విధానాల వల్ల దేశంలో నెలకొన్న సామాజిక ఐక్యత దెబ్బతింటోందని ఆమె అభిప్రాయపడ్డారు. తన జీవిత అనుభవాలు, రాజకీయ ప్రస్థానం ఆధారంగా రచించిన 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకంపై ఆమె ప్రముఖ ఆంగ్ల దినపత్రిక 'ది హిందూ'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో **మిగతా 2లో...**





మన జన ప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి...
తెలుగు దినపత్రిక

ప్రపంచ పెట్టుబడులే లక్ష్యంగా ఏపీ ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి

ప్రపంచ దేశాల ప్రభుత్వ ప్రతినిధులు, పారిశ్రామిక దిగ్గజాలు, సాంకేతిక నిపుణులను ఒకే వేదికపైకి తీసుకురావడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశం.ఈ సదస్సు ఏర్పాట్లపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేడు సీఐఐ ప్రతినిధులు, ప్రభుత్వ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ఈ సదస్సు ద్వారా ప్రపంచానికి తెలియజేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. విధాన రూపకర్తలు, పెట్టుబడిదారులు, విద్యాసంస్థలు, అంకుర సంస్థలను అనుసంధానించడం ద్వారా చర్చలను వాణిజ్య, సాంకేతిక భాగస్వామ్యాల దిశగా నడిపించాలని సూచించారు. రాష్ట్రంలో పెట్టుబడులు సురక్షితం, సులభతరం అనే భరోసాను ప్రపంచ పారిశ్రామికవేత్తలకు కల్పించాలని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ, సెమికండక్టర్ రంగాల్లో ఉన్న పెట్టుబడి అవకాశాలను విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు.ఈ సదస్సులో మొత్తం 1,250 మందికి పైగా దేశ, విదేశీ ప్రతినిధులు పాల్గొంటారని అంచనా. వీరిలో 15 మంది విదేశీ మంత్రులు, 40 మందికి పైగా అంతర్జాతీయ వక్తలు, 350 మంది విదేశీ ప్రతినిధులు, 900 మంది భారతీయ ప్రతినిధులు ఉన్నారు. సింగపూర్, నేపాల్, యూఏఈ, కెనడా, ఈజిప్ట్ వంటి అనేక దేశాల నుంచి ప్రభుత్వ ప్రతినిధులు, మంత్రులు హాజరుకానున్నారు. అలాగే, ప్రపంచ ఆహార కార్యక్రమం, ఆసియా అభివృద్ధి బ్యాంకు, ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం వంటి అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు కూడా పాల్గొంటారు.రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో ఆరు కీలక అంశాలపై ప్రధానంగా చర్చలు జరగనున్నాయి. వాణిజ్యం-పెట్టుబడులు, వ్యవసాయం-ఆహార భద్రత, నైపుణ్యాలు-అంతర్జాతీయ ఉపాధి, టెక్నాలజీ-భవిష్యత్ పరిశ్రమలు, స్వచ్ఛ ఇంధనం-సుస్థిర వృద్ధి వంటి అంశాలపై నిపుణులు తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు. వ్యాపార సంస్థల మధ్య కొత్త ఒప్పందాలు, భాగస్వామ్యాలను ప్రోత్సహించేందుకు 400కు పైగా బిజినెస్ టు బిజినెస్ (బీటుబీ), ప్రభుత్వాలతో పరిశ్రమల సంప్రదింపుల కోసం బిజినెస్ టు గవర్నమెంట్ (బీటుజీ) సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సదస్సు ద్వారా ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతికి కొత్త ఊపు వస్తుందని, రాష్ట్ర యువతకు అంతర్జాతీయ స్థాయిలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ప్రభుత్వం ఆశిస్తోంది.

ఈ20 కాస్తా 420గా మారింది..

మొదటిపేజీ తరువాయి

ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. కర్ణాటక ప్రభుత్వం నిర్వహించిన ల్యాబొరేటరీ పరీక్షల ఫలితాలను ఉటంకిస్తూ ఆయన శనివారం ఈ వ్యాఖ్యలు చేశారు. "ఈ20 కాస్తా 420గా మారింది ప్రజల కార్ల నుంచి పెట్రోల్ దొంగిలిస్తున్నారు!" అంటూ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా తీవ్రస్థాయిలో విమర్శించారు. చమురు సంస్థల టెస్టింగ్ ప్రక్రియలో పారదర్శకత లోపించిందని ఆయన ప్రశ్నించారు.కర్ణాటక ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి రిజ్వాన్ అర్షద్ విడుదల చేసిన వివరాల ప్రకారం, రాష్ట్రంలోని ఏడు జిల్లాల నుంచి సేకరించిన 14 పెట్రోల్ శాంపిల్స్‌ను ప్రభుత్వ గుర్తింపు పొందిన ల్యాబ్‌లో పరీక్షించగా, 11 శాంపిల్స్‌లో ఇథనాల్ శాతం 20కి మించి ఉన్నట్లు తేలింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్) శాంపిల్‌లో 31.2 శాతం, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) శాంపిల్‌లో 30.5 శాతం ఇథనాల్ ఉన్నట్లు నివేదికలు వెల్లడించాయి.

భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్), నయారా ఎనర్జీ, షెల్ వంటి సంస్థల నుంచి సేకరించిన ఇతర శాంపిల్స్‌లో ఇథనాల్ శాతం 25.5 నుంచి 26.5 మధ్య ఉన్నట్లు తేలింది. బెంగళూరు, కోలార్, చిక్కబళ్లాపుర, బెంగళూరు గ్రామీణ, రామనగర, మంగళూరు, తుమకూరు జిల్లాల్లో ఈ శాంపిల్స్‌ను సేకరించారు.అధిక మోతాదులో ఇథనాల్ కలపడం వల్ల వాహనదారుల మైలేజీ తగ్గడమే కాకుండా ఇంజిన్‌లు దెబ్బతినే ప్రమాదం ఉందని మంత్రి రిజ్వాన్ అర్షద్ ఆందోళన వ్యక్తం చేశారు. మొదట ఈ శాంపిల్స్‌ను ఆయిల్ కంపెనీల ల్యాబ్‌లకు పంపగా, వారు ఇథనాల్ శాతం వివరాలు వెల్లడించలేదని, అందుకే స్వతంత్ర ల్యాబ్‌లో పరీక్షలు చేయించాల్సి వచ్చిందని ఆయన వివరించారు.

ఆరోపణలను ఖండించిన చమురు సంస్థలు

అయితే, కర్ణాటక ప్రభుత్వం, రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను ఐఓసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ సహా అన్ని చమురు మార్కెటింగ్ కంపెనీలు తీవ్రంగా ఖండించాయి. శాంపిల్స్ సేకరణ, పరీక్షా విధానాలు నిర్దేశిత చట్టబద్ధమైన మార్గదర్శకాల ప్రకారం జరగలేదని ఆక్షేపించాయి. తాము దేశవ్యాప్తంగా 27 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 893 శాంపిల్స్‌తో జాయింట్ క్వాలిటీ మానిటరింగ్ నిర్వహించామని, అందులో కర్ణాటకకు చెందిన 56 శాంపిల్స్ కూడా ఉన్నాయని తెలిపాయి.

ఈ పరీక్షల్లో ఇథనాల్ శాతం 19 నుంచి 21 శాతం మధ్యలోనే ఉందని, కర్ణాటక శాంపిల్స్‌లో సగటున 19.3 శాతంగానే నమోదైందని స్పష్టం చేశాయి. ఈ తాజా వివాదంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇథనాల్ బ్లెండింగ్ కార్యక్రమం, దాని ప్రభావంపై మరోసారి దేశవ్యాప్తంగా చర్చ మొదలైంది. వాహనాల పనితీరు, వినియోగదారులపై పడుతున్న భారంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పల్లెల్లోనూ తగ్గని కూటమి జోరు

మొదటిపేజీ తరువాయి

చెదురుమదురు సంఘటనలు మినహా కౌంటింగ్ ప్రక్రియ సాఫీగా సాగిందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు.

ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం కాగా వివిధ జిల్లాల్లో అర్ధరాత్రి వరకు కొనసాగుతూనే ఉంది. కొన్ని ప్రాంతాల్లో లెక్కింపు జరుగుతుండగా, మరికొన్ని స్థానాలకు సంబంధించి పోస్టల్ ఓట్లను లెక్కిస్తున్నారు. దీంతో పూర్తిస్థాయి ఫలితాల వెల్లడిలో జాప్యం చోటుచేసుకుంది.

కూటమి ప్రభంజనం!

పరిషత్ పోరులో కూటమి తన ప్రభంజనాన్ని కొనసాగించింది. రాష్ట్రవ్యాప్తంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఫలితాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ తమ స్పష్టమైన ఆధిపత్యాన్ని ప్రదర్శించాయి. ప్రధానంగా టీడీపీ, జనసేన అభ్యర్థులు పెద్ద సంఖ్యలో విజయాన్ని అందుకున్నారు.

రాత్రి 11 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు కూటమి ప్రస్తుతం ఎన్నికలు జరిగిన 582 జెడ్పీటీసీ స్థానాల్లో 186 స్థానాలను కైవసం చేసుకుంది. వైసీపీ కేవలం 86 స్థానాలకు మాత్రమే పరిమితం అయింది. మరో రెండు స్థానాల్లో ఇండిపెండెంట్లు విజయం సాధించారు.

ఎంపీటీసీ ఫలితాల్లో కూడా కూటమిదే పైచేయి అయింది. ఈ ఎన్నికల్లో ప్రతిపక్ష వైసీపీ తన ఉనికిని చాటుకుంది. ప్రస్తుతం ఎన్నికలు జరిగిన స్థానాల్లో 6,952 స్థానాల్లో కూటమి విజయకేతనం ఎగురవేసింది. ఇక ప్రతిపక్ష వైసీపీ 1,500 ఎంపీటీసీ స్థానాలను సాధించి తన ఉనికిని చాటుకుంది. మరో 254 స్థానాల్లో వామపక్షాలతో పాటు ఇండిపెండెంట్లు విజయం సాధించారు.

ఇప్పటి వరకు వెల్లడైన ఫలితాల ప్రకారం టీడీపీ 336 జెడ్పీటీసీ స్థానాలు దక్కగా, మరో 47 చోట్ల ఆధిక్యంలో ఉంది. జనసేన ఇప్పటి వరకు 61 జెడ్పీటీసీ స్థానాలను కైవసం చేసుకోగా మరో 6 చోట్ల లీడ్‌లో ఉంది. బీజేపీ 18 జెడ్పీటీసీ స్థానాల్లో విజయం సాధించగా, మరో రెండు చోట్ల ఆధిక్యం ప్రదర్శిస్తోంది.

వైసీపీ 86 జెడ్పీటీసీ స్థానాలను సాధించగా మరో 11 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. రెండు చోట్ల ఇండిపెండెంట్లు విజయం సాధించారు.

ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి ఏకగ్రీవాలతో కలిపి వెల్లడించిన 9,817 ఫలితాల్లో 6,842 స్థానాల్లో టీడీపీ విజయకేతనం ఎగురవేసింది. జనసేనకు 811, బీజేపీకి 181 ఎంపీటీసీ స్థానాలు దక్కాయి. ఇక ప్రతిపక్ష వైసీపీ 1,500 స్థానాల్లో విజయాన్ని నమోదు చేసింది. మరోవైపు 240కి పైగా స్థానాల్లో ఇండిపెండెంట్లు, వామపక్షాలు



పాగా వేశాయి.

పులివెందులలో జగన్‌కు మళ్లీ షాక్!

స్థానిక ఎన్నికల ఫలితాలే పులివెందులలో మళ్లీ పునరావృతమయ్యాయి. వైసీపీ అధినేత సొంత నియోజకవర్గం పులివెందులలో పరిషత్ పోరులోనూ కూటమి పాగా వేసింది. పులివెందుల జెడ్పీటీసీ స్థానంతో పాటు ఆ నియోజకవర్గంలోని అత్యధిక ఎంపీటీసీ స్థానాలను కైవసం చేసుకుని జగన్‌కు షాక్ ఇచ్చింది.

పరిషత్ పోరులో జనసేనకు భంగపాటు తప్పలేదు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం ఎమ్మెల్యే బత్తుల రామకృష్ణ సతీమణి వెంకటలక్ష్మి సీతానగరం జెడ్పీటీసీగా పోటీ చేసి పరాజయం పాలయ్యారు. ఇక్కడ వైసీపీ అభ్యర్థి ఆమెపై 2,600 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ మండలంలో వైసీపీ అత్యధికంగా గెలవడం మరో విశేషం.

బొత్సకు మిశ్రమ ఫలితం.. కళాకు చేదు అనుభవం

విజయనగరం జిల్లాలో వైసీపీ, టీడీపీ సీనియర్ నేతలకు మిశ్రమ ఫలితాలు వచ్చాయి. బొత్స సత్యనారాయణ కుమార్తె అనూష పరాజయం పాలవగా, కోడలు బొత్స పూజిత మాత్రం విజయం సాధించింది. ఇక టీడీపీ సీనియర్ నేత కళా వెంకట్రావుకు పరిషత్ పోరులో చేదు అనుభవం ఎదురైంది. గరివిడి జెడ్పీటీసీ స్థానంలో ఆయన కోడలు బరిలోకి దిగగా వైసీపీ అభ్యర్థి బొత్స కోడలు పూజిత చేతిలో పరాజయం చెందారు.

జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఓట్ల లెక్కింపులో పలు ప్రాంతాల్లో ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. రాయలసీమ జిల్లాల్లో స్వల్ప ఘర్షణలు, వాగ్వివాదాలు జరిగాయి. తిరుపతి, అనంతపురం జిల్లాల్లో కౌంటింగ్ కేంద్రాల వద్ద వాగ్వివాదాలకు దిగిన పరిస్థితులు కనిపించాయి. పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించడంతో కౌంటింగ్ ప్రక్రియ యథావిధిగా కొనసాగింది.

ఇదిలా ఉండగా పరిషత్ పోరులో పల్నాడు, అనకాపల్లి జిల్లాల్లో కూటమి క్లీన్‌స్వీప్ చేసింది. అనకాపల్లి జిల్లాలో 24 జెడ్పీటీసీ స్థానాలకు గానూ 24 స్థానాల్లో కూటమి విజయం సాధించి రికార్డు సృష్టించింది. ఇక పల్నాడు జిల్లాలో 28 జెడ్పీటీసీ స్థానాలకు గానూ 28 స్థానాలు కూటమి హస్తగతం చేసుకుని వైసీపీని మట్టికరిపించింది.

రికార్డు స్థాయి మెజార్టీలు

పరిషత్ పోరులో అభ్యర్థులు పలు భారీ మెజార్టీ విజయాలను నమోదు చేశారు. గత ఎన్నికల రికార్డులను సైతం బద్దలు కొట్టారు.

పల్నాడు జిల్లా నకరికల్లు మండలంలో టీడీపీ జెడ్పీటీసీ అభ్యర్థి డాక్టర్ నాగోతు వెంకట సుబ్బారావు 32,919 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. రాష్ట్రంలోనే ఇది అత్యధిక మెజార్టీ విజయం.

పల్నాడు జిల్లా పెదకూరపాడు జెడ్పీటీసీ స్థానం కోసం బరిలోకి దిగిన జనసేన అభ్యర్థి శ్రీనివాసరావు 30,273 ఓట్ల తేడాతో వైసీపీ అభ్యర్థిపై విజయం సాధించారు.

కొడంగల్ టెండర్లలో పొంగులేటి కంపెనీకి లబ్ధి

మొదటిపేజీ తరువాయి

రైతులకు ఇంకా చుక్క నీరు అందకముందే, అంచనా వ్యయాన్ని దాదాపు ఐదు రెట్లు పెంచి రాష్ట్ర సంపదను దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. టెండర్ల ప్రక్రియలో మంత్రి పొంగులేటి కంపెనీ ప్రధాన పోటీదారుగా ఉందని, మిగతా కంపెనీలన్నీ నామమాత్రపు పోటీదారులేనని ఆయన ఆరోపించారు.

ఈ వ్యవహారంపై కేటీఆర్ తనదైన శైలిలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "క్రోనీ క్యాపిటలిజం, పగటి దోపిడీ అనే పదాలు కూడా ఈ దోపిడీ ముందు చాలా చిన్నవి అయిపోతున్నాయి. రాహుల్ గాంధీ గారూ.. ఈ దోపిడీని వర్ణించడానికి దయచేసి ఏదైనా కొత్త పదాన్ని వెతకడంలో నాకు సహాయం చేయండి" అని అన్నారు.ప్రజల అవసరాలను పక్కనపెట్టి, ప్రాజెక్టుల పేరుతో అంచనాలు పెంచి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని కేటీఆర్ దుయ్యబట్టారు. టెండర్ల ప్రక్రియలో పారదర్శకత లేకుండా, తమకు అనుకూలమైన కంపెనీలకే పనులు కట్టబెట్టేలా కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు ఉన్నాయని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు.

ఎమర్జెన్సీ పారపాటే..

మొదటిపేజీ తరువాయి

ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ప్రజాస్వామ్య విలువలు, లౌకికవాదం, కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తు తదితర అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు.

ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష పార్టీలకు సమాన అవకాశాలు లభించడం లేదని సోనియాగాంధీ ఆరోపించారు. ఎన్నికల సంఘం సహా పలు సంస్థలపై ప్రభుత్వ ప్రభావం ఉందని, ప్రధాన మీడియా, ఆర్థిక వనరులను అధికార పక్షం తనకు అనుకూలంగా వినియోగించుకుంటోందని విమర్శించారు.

ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు, స్వేచ్ఛ ఉండాలని ఆమె పేర్కొన్నారు. మతం, విశ్వాసం ఆధారంగా ప్రజల మధ్య విభేదాలు సృష్టించకూడదని, లౌకికవాద విలువలను కాపాడాల్సిన బాధ్యత రాజకీయ పార్టీలపై ఉందన్నారు.1975-77 మధ్య విధించిన ఎమర్జెన్సీ గురించి కూడా ఆమె ప్రస్తావించారు. ఆ సమయంలో ప్రజాస్వామ్య హక్కులు పరిమితమయ్యాయని, జరిగిన పరిణామాలపై వెనక్కి తిరిగి చూసినప్పుడు వాటి తీవ్రత అర్థమవుతుందని పేర్కొన్నారు. ఎమర్జెన్సీ కాలంలో జరిగిన తప్పిదాలపై ఇందిరాగాంధీ అనంతరం విచారం వ్యక్తం చేశారని గుర్తుచేశారు.రాజీవ్‌గాంధీ, ఇందిరాగాంధీల నుంచి ధైర్యం, సానుభూతి, లౌకికవాదం, ప్రజాస్వామ్యంపై నిబద్ధత వంటి విలువలను నేర్చుకున్నానని సోనియాగాంధీ తెలిపారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థలను తిరిగి బలోపేతం చేయడానికి రాజకీయ పార్టీలు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత పరిస్థితులపై ప్రజల్లో అసహనం పెరుగుతోందని, అయినప్పటికీ దేశ భవిష్యత్తుపై తాను ఆశావాదంతో ఉన్నానని ఆమె పేర్కొన్నారు.

టీడీపీ పాలన ఎమర్జెన్సీని తలపిస్తోంది

: చంద్రబాబు సర్కారుపై జగన్ ఫైర్

అమరావతి, మన జనప్రగతి నవంబర్ 07:

వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అరెస్టును ఆ పార్టీ అధినేత జగన్ తీవ్రంగా ఖండించారు. ఎన్నికల అక్రమాలను ప్రశ్నిస్తూ శాంతియుతంగా నిరసన తెలిపిన వారిపై తప్పుడు కేసులు బనాయించి, నిర్బంధించడం దుర్మార్గమని మండిపడ్డారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎమర్జెన్సీని తలపించే పాలన నడుస్తోందని, ఇది అత్యంత హేయమని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా విమర్శించారు.

గురువారం పరిషత్ ఎన్నికల పోలింగ్ ముగిశాక, గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలెం నుంచి నాగార్జున యూనివర్సిటీలోని స్ట్రాంగ్‌రూమ్‌కు వెళ్లాల్సిన బ్యాలెట్ బాక్సులను మధ్యలో నల్లపాడు వద్ద ఎందుకు దించారని జగన్ ప్రశ్నించారు. ఈ అక్రమాన్ని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని, శాంతియుతంగా ఆందోళన చేస్తున్న తమ పార్టీ నేతలు, కార్యకర్తలపై లాఠీఛార్జ్ చేయడం దారుణమన్నారు. తప్పు చేసి, బ్యాలెట్ బాక్సులు మార్చే ప్రయత్నం చేస్తూ, మళ్లీ తమ వారిపైనే అక్రమ కేసులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏకంగా ఒక ఎమ్మెల్సీపై డెకాయిటీ, దొంగతనం కేసులు పెట్టడం కంటే దుర్మార్గం ఏముంటుందని నిలదీశారు.ఈ సందర్భంగా చంద్రబాబును ఉద్దేశించి, "ఈ స్థానిక ఎన్నికల్లో నామినేషన్ల నుంచి బ్యాలెట్ బాక్సుల వరకు అన్నింటినీ రిగ్గింగ్ చేస్తున్నారు. ఈ రకంగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుంటే, ప్రశ్నించిన వారిని అరెస్టు చేసి జైలుకు పంపుతారా? అధికార, పోలీసు బలంతో అక్రమాలు దాచిపెట్టలేరు. మీ అప్రజాస్వామిక పద్ధతులను దేశమంతా చూస్తోంది. ప్రజలు మీకు తగిన బుద్ధి చెబుతారు" అని జగన్ తన ట్వీట్‌లో హెచ్చరించారు.

సంక్రాంతి తర్వాత జిల్లాల్లో పర్యటిస్తా

కొడంగల్, మన జనప్రగతి నవంబర్ 07:



ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఎదురయ్యే అవకాశముందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రాజెక్టుల్లో ప్రస్తుతం ఉన్న నీళ్లు తాగునీటి అవసరాలకే సరిపోతాయని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని, రైతులు ఆరుతడి పంటలే సాగు చేయాలని సూచించారు. ఎల్‌నినోపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ప్రచారాన్ని నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. కష్టకాలంలో ప్రజలకు అండగా ఉండాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, అందరం కలిసికట్టుగా పరిస్థితులను ఎదుర్కొందామని పిలుపునిచ్చారు.సంక్రాంతి తర్వాత రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటిస్తానని సీఎం ప్రకటించారు. మూడు రోజుల కొడంగల్ నియోజకవర్గ పర్యటనలో భాగంగా శనివారం హకీంపేట, దుద్యాల మండలాల్లో రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ప్రారంభించారు. పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. హకీంపేటలో నిర్మిస్తున్న ఎడ్యుకేషన్ హబ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో బీఆర్ఎస్ నేతలపై విమర్శలు గుప్పించారు.ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం ఉంటే తెలంగాణలోనే కరవు వచ్చినట్లు బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని రేవంత్ విమర్శించారు. బావబామ్మర్దులు ఊళ్లపై పడి అబద్ధాలు చెబుతారని, వారి మాటలు విని రైతులు నష్టపోవద్దని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వరి వంటి ఎక్కువ నీరు అవసరమయ్యే పంటల జోలికి వెళ్లకుండా ఆరుతడి పంటలు సాగు చేయాలని కోరారు.

మేడిగడ్డ నుంచి నీళ్లు ఎత్తిపోసుకోకపోవడం వల్లే ఆంధ్రప్రదేశ్‌కు నీళ్లు వెళ్తున్నాయన్న బీఆర్ఎస్ ఆరోపణల్లో నిజం లేదని సీఎం అన్నారు. మేడిగడ్డ బ్యారేజీలో 16 టీఎంసీల నీరు ఉంటేనే కన్నెపల్లి నుంచి ఎత్తిపోసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లు దించే పరిస్థితి కూడా లేదన్నారు. బీఆర్ఎస్ అవినీతి వల్లే ఈ మూడు బ్యారేజీలు పనిచేయడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన దేవాదుల, వైఎస్సార్ ప్రారంభించిన ప్రాజెక్టులే ప్రస్తుతం రైతులకు, ఖమ్మం జిల్లాకు అండగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.

పాలమూరు నుంచి గెలిచిన కేసీఆర్ భారీ బడ్జెట్ ఖర్చు చేసినా అక్కడి ప్రాజెక్టులను పూర్తి చేయలేదని రేవంత్ విమర్శించారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పక్కనపెట్టి పేరు, స్థలం, అంచనాలు మార్చి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు బీఆర్ఎస్ పాలనలోనే కూలిపోయిందని ఆరోపించారు. వచ్చే డిసెంబరులో ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలకు స్పీకర్ అనుమతి కోరుతున్నామని, ఆ సమావేశాల్లో ఎల్‌నినో, కాళేశ్వరం అంశాలపై చర్చించేందుకు సిద్ధమని సవాల్ విసిరారు.కొడంగల్-నారాయణపేట-మక్తల్ ఎత్తిపోతల పథకం అంచనాలు పెంచడంపై కేటీఆర్ చేస్తున్న విమర్శలకూ సీఎం సమాధానమిచ్చారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొడంగల్ ప్రాంతానికి ఏం చేశారని ప్రశ్నించారు. గతంలో ప్రాజెక్టుల కోసం భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.2 లక్షలు ఇచ్చేందుకు కూడా కేసీఆర్ ప్రభుత్వం ముందుకు రాలేదని ఆరోపించారు. తమ ప్రభుత్వం మాత్రం భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.20 లక్షల వరకు పరిహారం ఇస్తోందన్నారు. హైదరాబాద్-లగచర్ల ప్రాంతాన్ని ఢిల్లీ-నోయిడా తరహాలో అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నామని, అక్కడ పెట్టుబడులు పెట్టేందుకు పెద్ద కంపెనీలు వస్తున్నాయని తెలిపారు. హకీంపేటలో 250 ఎకరాల్లో ఎడ్యుకేషన్ హబ్ నిర్మిస్తున్నట్లు వెల్లడించారు.

కేటీఆర్ వేషభాషలు మార్చుకున్నా ప్రజలు నమ్మరని రేవంత్ ఎద్దేవా చేశారు. గడ్డం పెంచుకున్నంత మాత్రాన తనలా మారలేరని వ్యాఖ్యానించారు. తాను మూడేళ్లుగా గంట కూడా సెలవు తీసుకోకుండా పనిచేస్తున్నానని చెప్పారు. సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇచ్చారని, అబద్ధాలు ప్రచారం చేస్తున్న కుటుంబాన్ని ప్రజలు బహిష్కరించాలని పిలుపునిచ్చారు.

దేవనకొండలో కూటమి ఆధిక్యం

- 20 ఎంపీటీసీ స్థానాల్లో 13 చోట్ల టీడీపీ, జనసేన అభ్యర్థుల విజయం
- వైఎస్సార్‌సీపీకి దక్కిన 7 స్థానాలు



దేవనకొండ మన జనప్రగతి నవంబర్ 07:-దేవనకొండ మండలంలో జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఆధిక్యం సాధించారు. మండల పరిధిలోని మొత్తం 20 ఎంపీటీసీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ 10 స్థానాలు, జనసేన పార్టీ 3 స్థానాల్లో విజయం సాధించగా, వైఎస్సార్‌సీపీ 7 స్థానాలను కైవసం చేసుకుంది.ఈ ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన పార్టీలు కలిపి మొత్తం 13 స్థానాల్లో విజయం సాధించడంతో మండలంలో కూటమి ఆధిక్యం స్పష్టమైంది. అదేవిధంగా కూటమి తరపున ఎంపీపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన ఈడిగ మహాలక్ష్మి ఘన విజయం సాధించినట్లు సమాచారం. ఎన్నికల ఫలితాలతో కూటమి శ్రేణుల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి.

లింగాల జడ్పీటీసిగా సరళాదేవి గెలుపు



లింగాల మన జనప్రగతి నవంబర్ 07:-రాష్ట్రవ్యాప్తంగా పరిషత్ ఎన్నికల్లో భాగంగా లింగాల జడ్పీటిసి స్థానానికి 5వ తేదీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల బరిలో టిడిపి అభ్యర్థినిగా యమనూరు సరళాదేవి, వైకాపా అభ్యర్థినిగా పెద్దమల్లు శ్రీదేవిలు ఎన్నికల బరిలో నిలిచారు. ప్రధాన పార్టీల మధ్య ప్రచారం తీవ్రస్థాయిలో జరిగింది. పులివెందుల పట్టణంలోని రవణప్ప సత్రంబడి ఎన్నికల కౌంటింగ్‌కేంద్రంలో లింగాల జడ్పిటిసి స్థానానికి పోలైన ఓట్లను 7 తేదీ రెండు రౌండ్లుగా ఎన్నికల అధికారులు లెక్కించారు. ఇందులో భాగంగా టిడిపి అభ్యర్థి సరళాదేవికి 1వ రౌండ్ లో 4953, రెండవ రౌండ్లో 5193, పోస్టల్ బ్యాలెట్ 2 ఓట్లు వచ్చాయి. వైకాపాకు చెందిన పెద్దమల్లు శ్రీదేవికి మొదటి రౌండులో 5713, రెండవ రౌండ్లో 2864, పోస్టల్ బ్యాలెట్ 22 ఓట్లు వచ్చాయి. అలాగే నోటా కు 128, చెల్లని ఓట్లు340, ఇరువురు స్వతంత్ర అభ్యర్థులకు కలిపి 47 ఓట్లు వచ్చాయి.దీంతో వైకాపా అభ్యర్థిని శ్రీదేవి పై టిడిపి అభ్యర్థిని సరళాదేవి 1550 ఓట్లతో ఆదిక్యంతోవిజయం సాధించి లింగాల జడ్పిటిసి గా ఎన్నికైనట్లు ఆర్వో సుహాసిని అధికారికంగా యమ్మనూరు సరళాదేవి కి డిక్లరేషన్ ఫారం అందజేశారు.

వైసీపీ కంచుకోటలో టీడీపీ జెండా

- పులివెందుల జడ్పీటీసీ స్థానం కైవసం
- 1,463 ఓట్ల మెజారిటీతో బొంగాని భారతి గెలుపు



పులివెందుల అర్బన్ మన జనప్రగతి నవంబర్ 07:పులివెందుల మండల జడ్పీటీసీ స్థానంలో తెలుగుదేశం పార్టీ విజయకేతనం ఎగురవేసింది. తీవ్ర ఉత్కంఠ రేపిన ఈ ఎన్నికల ఫలితాల్లో టీడీపీ అభ్యర్థి బొంగాని భారతీ యాదవ్ (బి.భారతి) ఘన విజయం సాధించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున బరిలోకి దిగిన ఎం.సావిత్రిపై భారతీ 1,463 ఓట్ల స్పష్టమైన మెజారిటీతో విజయం నమోదు చేసుకున్నారు.కౌంటింగ్ ప్రారంభం నుంచే ఆధిక్యాన్ని కనబరిచిన భారతీ యాదవ్, తుది రౌండ్ ముగిసే సమయానికి ప్రత్యర్థిపై పైచేయి సాధించారు. వైసీపీకి కంచుకోటగా భావించే పులివెందుల నియోజకవర్గంలో మొత్తం 7 జడ్పీటీసీ స్థానాలు ఉండగా, అందులో ఇప్పటికే మూడు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 4 స్థానాలకు ఓట్ల లెక్కింపు జరుగుతుండగా, పులివెందుల స్థానంలో టీడీపీ అభ్యర్థి గెలుపొందడం వైసీపీకి గట్టి ఎదురుదెబ్బగా మారింది.ఇటీవల మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లోనూ పులివెందులలో టీడీపీ కూటమి 40 వార్డులకు గాను 37 వార్డులను కైవసం చేసుకోగా,వైసీపీ కేవలం 3 వార్డులకే పరిమితమైన విషయం తెలిసిందే.ఆ విజయ పరంపరను కొనసాగిస్తూ తాజా జడ్పీటీసీ ఉప ఎన్నికలోనూ పట్టు సాధించడంతో టీడీపీ నాయకులు,కార్యకర్తలు సంబరాల్లో మునిగిపోయారు.

క్యాన్సర్కు భయపడాల్సిన పనిలేదు

- జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం





కర్నూలు బ్యూరో మన జనప్రగతి నవంబర్ 07:-నేటి కాలంలో క్యాన్సర్ అంటే భయపడాల్సిన పనిలేదని దాని జయించవచ్చని అందుకు అవగాహన ఆత్మస్థైర్యం ఎంతో ముఖ్యమని డాక్టర్ సి. వాసు రెడ్డి అన్నారు. శనివారం ప్రముఖ శాస్త్రవేత్త మేరీ క్యూరీ జన్మదినాన్ని పురస్కరించుకుని నవంబర్ 7న నిర్వహించే జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని శనివారం కర్నూలులోని రవీంద్ర జూనియర్ కళాశాల బాలికల విభాగంలో, కృష్ణా నగర్ లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో నిర్వహించారు.2014 సంవత్సరం నుంచి నిర్వహిస్తున్న ఈ అవగాహన కార్యక్రమంలో సుమారు 300 మంది విద్యార్థినులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో క్యాన్సర్ నివారణ, ముందస్తు గుర్తింపు, స్క్రీనింగ్ పరీక్షలు, వివిధ చికిత్సా విధానాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. క్యాన్సర్‌కు సంబంధించిన ప్రమాద కారకాలు, ఆరోగ్యకరమైన జీవనశైలి ప్రాముఖ్యత, వ్యాధిని ప్రారంభ దశలో గుర్తించడం ద్వారా మెరుగైన చికిత్సా ఫలితాలు సాధించవచ్చనే అంశాలను వివరించారు.డాక్టర్ సి. వాసు రెడ్డి మాట్లాడుతూ, క్యాన్సర్ అనేది అన్ని సందర్భాల్లో ప్రాణాంతకమైన వ్యాధి కాదని, ప్రారంభ దశలో గుర్తించిన అనేక క్యాన్సర్లకు సమర్థవంతమైన చికిత్స అందుబాటులో ఉందని తెలిపారు. క్యాన్సర్‌పై సమాజంలో ఉన్న అపోహలను తొలగించి, తమ కుటుంబ సభ్యులకు మరియు సమాజానికి అవగాహన కల్పించాలని విద్యార్థినులకు సూచించారు.ఈ కార్యక్రమంలో రవీంద్ర బాలికల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి జ్యోతి, రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ కె. అరుణ, రెడ్ క్రాస్ డిస్ట్రిక్ట్ ఫీల్డ్ ఆఫీసర్ రమేష్ పాల్గొన్నారు.

ఎన్ని అరాచకాలు చేసినా నైతిక విజయం వైఎస్సార్‌సీపీదే: ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి

ఎన్నికలు జరపడం ఎందుకు.. ఎంపిక చేసుకుంటే పోలా?

కూటమి అరాచకాలను ఎండగట్టిన కడప ఎంపీ

పులివెందుల అర్బన్ మన జనప్రగతి నవంబర్ 07: స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార తెలుగుదేశం పార్టీ తీవ్ర అరాచకాలకు పాల్పడిందని,ఇంత ఘోరంగా ఎన్నికలు నిర్వహించే బదులు భవిష్యత్తులో ఎన్నికలు జరపకుండా వారే నేరుగా ఎంపిక చేసుకుంటే సరిపోతుందని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎన్ని రిగ్గింగ్‌లు,దౌర్జన్యాలు చేసినా ప్రజలు వైఎస్సార్‌సీపీ వెంటే నిలిచారని,ఈ ఎన్నికల్లో నైతిక విజయం తమ పార్టీదేనని ఆయన స్పష్టం చేశారు.పులివెందుల నియోజకవర్గ పరిధిలోని జెడ్పీటీసీ,మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై ఆయన మీడియా సమావేశంలో సమగ్ర వివరాలు వెల్లడించారు.నియోజకవర్గంలోని పులివెందుల మున్సిపాలిటీతో పాటు నాలుగు మండలాల్లోని మొత్తం 166 పోలింగ్ బూత్‌లలో ఎన్నికలు నిర్వహిస్తే,అందులో ఏకంగా 90 బూత్‌లలో టీడీపీ నాయకులు బహిరంగంగా రిగ్గింగ్‌కు పాల్పడ్డారని అవినాష్ రెడ్డి ఆరోపించారు.పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని 15 బూతుల్లో 9 బూతులను (8 పూర్తిగా, 1 పాక్షికంగా) రిగ్గింగ్ చేసినప్పటికీ,టీడీపీ మెజారిటీ కేవలం 1,463 ఓట్లకు మాత్రమే పరిమితమైందన్నారు. లింగాల మండలం 33 పోలింగ్ బూతులకు గాను 14 బూతుల్లో యథేచ్ఛగా రిగ్గింగ్,స్టాంపింగ్ చేసుకుని దాదాపు 8,000 నుంచి 9,000 ఓట్లు అక్రమంగా వేసుకున్నప్పటికీ, టీడీపీ కేవలం 1,500 ఓట్ల స్వల్ప తేడాతో మాత్రమే గట్టెక్కిందని అలాగే వేముల మండలం మండల కేంద్రంలోని 6 బూతులను టీడీపీ నేతలు రిగ్గింగ్ చేసినా, ప్రజల మద్దతుతో వైఎస్సార్‌సీపీ 1,569 ఓట్ల ఆధిక్యంతో ఘన విజయం సాధించిందన్నారు.వేంపల్లి మండలం లో ప్రశాంతంగా,నిష్పక్షపాతంగా (ఫ్రీ అండ్ ఫెయిర్) ఎన్నికలు జరిగాయని,అక్కడ ప్రజా తీర్పు స్పష్టంగా కనిపించిందని తెలిపారు. కూటమి (టీడీపీ, జనసేన, బీజేపీ) మొత్తం ఏకమైనా, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఏకంగా 19,192 ఓట్ల భారీ మెజారిటీతో చారిత్రాత్మక విజయం సాధించారు.**కూటమిపై 3,873 ఓట్ల స్పష్టమైన మెజారిటీ** పులివెందుల మున్సిపాలిటీతో పాటు నాలుగు మండలాల (వేముల,వేంపల్లి,లింగాల, పులివెందుల) ఫలితాలను పరిశీలిస్తే వైఎస్సార్



కాంగ్రెస్ పార్టీదే స్పష్టమైన ఆధిక్యమని ఎంపీ వివరించారు. వైఎస్సార్‌సీపీ సాధించిన ఓట్లు 55,495 కాగా టీడీపీ + జనసేన + బీజేపీ కూటమి ఓట్లు 51,622 మాత్రమే అనివైఎస్సార్‌సీపీ ఆధిక్యత (మెజారిటీ) 3,873 ఓట్లు సాధించదని పేర్కొన్నారు.నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నా,ఏజెంట్లను బలవంతంగా బయటకు పంపించినా,తప్పుడు కేసులు బనాయించినా నియోజకవర్గ వ్యాప్తంగా ఓటర్లు వైఎస్సార్‌సీపీకే అత్యధిక ఓట్లు కట్టబెట్టారని,ఈ ఘన విజయాన్ని పార్టీ కార్యకర్తల పోరాట పటిమకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు.నైతిక విజేతలకు అండగా ఉంటాం అని టీడీపీ రిగ్గింగ్ వల్ల స్వల్ప తేడాతో ఓటమి చెందిన లింగాల జడ్పీటీసీ అభ్యర్థి పెద్దమల్లు శ్రీదేవి, సింహాద్రిపురం జడ్పీటీసీ అభ్యర్థి మోపూరు సావిత్రి నైతికంగా విజయం సాధించారని,పార్టీ వారికి ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.వేంపల్లె జడ్పీటీసీగా రికార్డు మెజారిటీ సాధించిన భర్తల వెంకట శివమ్మ, వేముల జడ్పీటీసీగా గెలుపొందిన నాగెళ్ల సత్యప్రభావతమ్మలకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు.

జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా కొనసాగుతున్న ఓట్ల లెక్కింపు

కర్నూలు బ్యూరో మన జనప్రగతి నవంబర్ 07:జిల్లా వ్యాప్తంగా 6 కౌంటింగ్ కేంద్రాల్లో ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సజావుగా కొనసాగుతోందని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు.ఈ సంధర్భంగా శనివారం కర్నూలు నగరంలోని బి.క్యాంపులో ఉన్న సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాల, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను కర్నూలు ఎస్పీ పరిశీలించారు.పోలీసు అధికారులకు భద్రతా ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు.కౌంటింగ్ ప్రక్రియ వద్ద అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.జిల్లా వ్యాప్తంగా కర్నూలులో 2,ఎమ్మిగనూరులో 1, ఆదోనిలో 1,పత్తికొండలో 1,ఆలూరులో 1 మొత్తం 6 కౌంటింగ్ కేంద్రాల్లో ఓట్ల లెక్కింపునకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని కౌంటింగ్ కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోందని తెలిపారు.కౌంటింగ్ కేంద్రాల వద్ద



పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు. ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, ఫలితాల అనంతరం విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించరాదన్నారు.నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఉదయం ప్రారంభమైన పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు దాదాపు పూర్తయిందని, సాధారణ ఓట్ల లెక్కింపు అన్ని కేంద్రాల్లో ప్రశాంతంగా కొనసాగుతోందని పేర్కొన్నారు.కౌంటింగ్ కేంద్రాల పరిసరాల్లో 100 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమల్లో ఉందన్నారు. ఎన్నికల అధికారుల అనుమతి పొందిన అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లకు మాత్రమే లోపలికి ప్రవేశం ఉంటుందన్నారు. భద్రతా పరంగా సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు పోలీసు బలగాలను మోహరించడంతో పాటు సీసీటీవీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు.ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు పోలీసులకు సహకరించి ప్రశాంత వాతావరణాన్ని కొనసాగించాలని కర్నూలు ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ గారు విజ్ఞప్తి చేశారు. కర్నూలు ఎస్పీతో పాటు కర్నూలు డిఎస్పీ శ్రీ రాఘవేంద్ర, సిఐలు మధుసుధన్ రావు, చంద్రబాబు నాయుడు,శేషయ్య, తబ్రేజ్ , ఎస్సైలు ఉన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలతో మమేకమై పనిచేస్తుంది

బిఆర్ఎస్ కావాలని తప్పుడు ప్రచారం చేస్తుంది

కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్



కూకట్ పల్లి మన జన ప్రగతి నవంబర్ 07:- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భూములను అమ్ముకుంటుందన్న కూకట్పల్లి శాసనసభ్యుడు విమర్శలను టిపిసిసి ఉపాధ్యక్షుడు తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ తిప్పి కొట్టారు.గత టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రస్తుత తమ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి సంక్షేమం పైనా,ప్రభుత్వ భూముల అమ్మకాల పైన బహిరంగ చర్చకు తాను సిద్ధమని ఆయన సవాల్ విసిరారు. దమ్ముంటే కృష్ణారావు తను చేసిన ఆరోపణలపై నిలబడాలంటూ ఆయన చాలెంజ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం భూములను అమ్ముకుంటోశీదంటూ కూకట్పల్లి శాసనసభ్యుడు మాధవరం కృష్ణారావు చేసిన ఆరోపణలపై రమేష్ తీవ్రంగా స్పందించారు . రమేష్ మాట్లాడుతూ కృష్ణారావు విమర్శలను తిప్పి కొట్టారు.ముఖ్యమంత్రి పై విమర్శలు చేసేటప్పుడు నోరు సంభాళిశీచుకుని మాట్లాడాలని హెచ్చరించారు .కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలను దృష్టిలో పెట్టుకొని సంక్షేమం అభివృద్ధిని కొనసాగిస్తోందన్నారు.ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేకనే కృష్ణారావు ఇతర టిఆర్ఎస్ నాయకులు నోటికి వచ్చినట్టు మాట్లాడుతున్నారన్నారు.బంగారు తెలంగాణ అంటూ టిఆర్ఎస్ ప్రభుత్వం ఎనిమిదిన్నర లక్షల కోట్ల రూపాయలు అప్పులు రాష్ట్రం నెత్తిన పెట్టి పోయిందన్నారు. చెరువులు కుంటలు ప్రభుత్వ స్థలాల ఆక్రమణలకు అక్రమ నిర్మాణాలకు కృష్ణారావు, అతని అనుచరులే ఆద్యులని రమేష్ ధ్వజమెత్తారు.కేవలం హౌసింగ్ బోర్డ్ అభివృద్ధికి తాను 2 వేలకోట్ల రూపాయలు వెచ్చించానని కృష్ణారావు చెప్పడాన్ని రమేష్ ప్రశ్నించారు.దీనిపై తాను బహిరంగ చర్చకు సిద్ధమన్నారు కెపిహెచ్బి కాలనీలో ఒక స్కూలు ఒక ఆసుపత్రి కూడా కట్టలేక గత ప్రభుత్వం చేతులెత్తేసిందన్నారు స్కూల్ కోసం తెచ్చిన స్టీల్ సైతం టిఆర్ఎస్ నాయకులు అమ్ముకున్నారని బండి రమేష్ ధ్వజమెత్తారు ఎమ్మెల్యేగా మూడుసార్లు గెలిచిన కృష్ణారావు కూకట్పల్లికి ల్యాండ్ మార్క్ గా తను ఏం చేశాడో చూపించాలన్నారు.తన 12 ఏళ్ల హయాంలో పేద ప్రజల కోసం కృష్ణారావు ఎన్ని ఇళ్లు కట్టించాడో చూపించాలన్నారు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అన్ని రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతుందని రమేష్ పేర్కొన్నారు.ఐటీ, పారిశ్రామిక, ఇతర ఉత్పాదకరంగాల్లో రాష్ట్రం ముందంజ వేసింది అన్నారు ఎల్ నినో కారణంగా ప్రపంచవ్యాప్తంగా 100 దేశాల్లో కరువు వస్తే దాన్ని కాంగ్రెస్ ప్రభుత్వానికి అంటగట్టి టిఆర్ఎస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ వారిని మోసం చేయాలని చూస్తున్నారన్నారు. కరువు నివారణ కోసం తాగునీరు సాగునీరు ఏర్పాటు కోసం సీఎం రేవంత్ రెడ్డి అధికారులతో కలిసి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారన్నారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం హౌసింగ్ బోర్డ్ లో 11 ఎకరాలను ప్రభుత్వం కేటాయించిందని 400 ఇళ్ల నిర్మాణం ఇప్పటికే ప్రారంభమైందని రెండో విడతలో మరో మూడు వేల ఇళ్ళ నిర్మాణం త్వరలో ప్రారంభం కానుందని రమేష్ తెలిపారు.తాను, అధికారులు నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రతి డివిజన్లో ప్రతిరోజు పర్యటిస్తున్నామని పేద ప్రజల సంక్షేమమే తమ లక్ష్యమని రమేష్ పేర్కొన్నారు.

సుగవాసి ప్రసాద్ బాబు ఘన విజయం



గాలివీడు మన జనప్రగతి నవంబర్ 07:-అన్నమయ్య జిల్లా గాలివీడు మండల జడ్పీటీసీ ఎన్నికల్లో రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్ బాబు ఘన విజయం సాధించారు. 30178 ఓట్ల మెజారిటీతో విజయం సాధించినట్లు టీడీపీ శ్రేణులు వెల్లడించాయి. కూటమి ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న నమ్మకానికి ఈ విజయం నిదర్శనమని పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కీర్తిశేషులు మాజీ ఎంపీ, ఎమ్మెల్యే సుగవాసి పాలకొండరాయుడు సేవలను నాయకులు, కార్యకర్తలు స్మరించుకున్నారు. విజయం పట్ల టీడీపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి.

చిన్నమండెం జడ్పిటిసి లక్ష్మీప్రసాద్ రెడ్డికి ఘన సత్కారం

- రాష్ట్ర తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు గాజుల ఖాదర్బాషా



రాయచోటి మన జనప్రగతి నవంబర్ 07:-రాయచోటి నియోజకవర్గ ప్రజల కోసం నిరంతరం శ్రమించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మరియు చిన్నమండెం జడ్పిటిసి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి అని గాజుల ఖాదర్ భాష పేర్కొన్నారు. చిన్నమండెం జడ్పిటిసి ఎన్నికలలో అత్యధిక మెజార్టీతో గెలిచిన గౌరవ జడ్పిటిసి మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి కి హృదయపూర్వక ధన్యవాదములు గాజుల ఖాదర్ బాషా తెలియజేశారు రాయచోటి నియోజకవర్గం అభివృద్ధి ఇరువురి నాయకులతో ఎంతో అభివృద్ధి చెందుతుందని ప్రజలందరూ నమ్మకంతో ఉన్నారని తెలిపారు వారంటే ఎంతో ధైర్యము నమ్మకము ప్రతి రాయచోటి నియోజకవర్గ వాసికి ఉందని తెలిపారు.

వేంపల్లి శ్రీ చైతన్య పాఠశాలలో దీపావళి ముందస్తు వేడుకలు



వేంపల్లె మన జనప్రగతి నవంబర్ 07:-స్థానిక వేంపల్లె శ్రీ చైతన్య ఉన్నత పాఠశాలలో శనివారం దీపావళి ముందస్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి ముందుగా లక్ష్మీ పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు.అనంతరం చిచ్చు బుడ్లు కాల్చి దీపావళి శు భాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు పలువురుని ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆ పాఠశాల కరస్పాండెంట్ బండ్రెడ్డి చక్రపాణి రెడ్డి మేనేజింగ్ డైరెక్టర్లు చేతన్ రెడ్డి, చైతన్య రెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

వైవీయూ పీజీ కోర్సుల్లో నేరుగా ప్రవేశాలు

కడప రూరల్ మన జనప్రగతి నవంబర్ 07:- యోగి వేమన విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని పి.జి. కళాశాల లో పలు పీజీ కోర్సుల్లో ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ సంచాలకులు ఆచార్య వి.రామకృష్ణ తెలిపారు. బయోటెక్నాలజీ అండ్ బయోఇన్ఫర్మాటిక్స్‌లో 5 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ కోర్సులు, అప్లైడ్ జియాలజీ, ఫిజిక్స్, 4 సంవత్సరాల బీఎఫ్ఏ కోర్సు, కంప్యూటర్ అప్లికేషన్స్‌లో 4 సంవత్సరాల బీకామ్ ఆనర్స్, ఎకనామిక్స్‌లో 5 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ ఎంఏ కోర్సుల కోసం స్పాన్సర్డ్ సీట్లు ఖాళీలు ఉన్నాయని వివరించారు. ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల 9వ తేదీ నుంచి విశ్వవిద్యాలయ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్‌తో జాతీయ సమైక్యతకు బలం

● 11వ బెటాలియన్ పీఎం శ్రీ జెడ్పీ హైస్కూల్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు



సిద్దవటం మన జనప్రగతి నవంబర్ 07:-ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమంలో భాగంగా 11వ బెటాలియన్‌లోని పీఎం శ్రీ జెడ్పీ హైస్కూల్‌లో పంజాబ్ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, జీవన విధానంపై శనివారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్-పంజాబ్ రాష్ట్రాల మధ్య ఉన్న సాంస్కృతిక అనుబంధాన్ని చాటుతూ 'భిన్నత్వంలో ఏకత్వం' స్ఫూర్తిని విద్యార్థులకు వివరించారు. పంజాబ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సంప్రదాయ దుస్తులను ధరించిన విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పొతులూరయ్య మాట్లాడుతూ..చిన్ననాటి నుంచే విద్యార్థులకు వివిధ రాష్ట్రాల భాషలు, సంస్కృతులు, జీవన విధానాలను పరిచయం చేయడం ద్వారా జాతీయ సమైక్యత, పరస్పర గౌరవం, సోదరభావం పెంపొందుతాయని తెలిపారు. పంజాబ్‌ను భారతదేశ ధాన్యాగారంగా,ఆంధ్రప్రదేశ్‌ను అన్నపూర్ణ భూమిగా పేర్కొంటూ రెండు రాష్ట్రాల సంస్కృతుల్లో అనేక సారూప్యతలు ఉన్నాయని అన్నారు. కార్యక్రమ సమన్వయకర్త, నిర్వాహకులు,జేవీవీ కడప జిల్లా అధ్యక్షుడు సమీర్ బాషా మాట్లాడుతూ..పాఠ్యపుస్తకాల పరిజ్ఞానంతో పాటు ఇతర రాష్ట్రాల సంస్కృతి, ఆహారపు అలవాట్లు, పండుగలు, సంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పంజాబ్ సంప్రదాయాలను ఆంధ్రప్రదేశ్ సంప్రదాయాలతో పోల్చి విద్యార్థులకు వివరించినట్లు తెలిపారు. సామాజిక శాస్త్ర ఉపాధ్యాయుడు యూనుస్ మాట్లాడుతూ భాషలు, సంస్కృతులు, సంప్రదాయాలు వేరైనా మనమంతా ఒకే దేశానికి చెందినవారమనే భావననే 'భిన్నత్వంలో ఏకత్వం'కు నిజమైన ప్రతిరూపమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ, బోధనేతర సిబ్బందితో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఘనంగా టీఎన్‌టీయూసీ నాయకుడు భాస్కర్ రెడ్డి జన్మదిన వేడుకలు

● నగిరిగుట్టలో అభిమానులు, కూటమి నేతల సందడి
● కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



పులివెందుల అర్బన్ మన జనప్రగతి నవంబర్ 07:తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ (టీఎన్‌టీయూసీ) నియోజకవర్గ అధికార ప్రతినిధి నల్లగారి భాస్కర్ రెడ్డి జన్మదిన వేడుకలు నగిరిగుట్టలో అత్యంత వైభవంగా జరిగాయి.స్థానిక కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు ఆయన అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు.కార్యక్రమ ప్రాంగణానికి చేరుకున్న భాస్కర్ రెడ్డికి కార్యకర్తలు, అభిమానులు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు.అనంతరం ఏర్పాటు చేసిన ప్రత్యేక కేక్‌ను ఆయన కట్ చేసి,విచ్చేసిన నాయకులకు, శ్రేయోభిలాషులకు తినిపించారు.ఈ సందర్భంగా కూటమి ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు ఆయనకు శాలువాలు కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.నిరంతరం ప్రజా సమస్యలపై స్పందిస్తూ,కార్మిక శ్రేణుల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న భాస్కర్ రెడ్డి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని, ఆయన ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని నేతలు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కూటమి ముఖ్య నేతలతో పాటు భారీ సంఖ్యలో యువత, కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.


ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే స్కౌట్స్ లక్ష్యం: జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి



రాయచోటి మన జనప్రగతి నవంబర్ 07:-విద్యార్థుల్లో క్రమశిక్షణ సేవా భావం పెంపొందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే స్కౌట్స్ అండ్ గైడ్స్ లక్షమని జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి అన్నారు.భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థ ఏర్పాటై 77 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాయచోటిలోని డైట్ లో శనివారం నిర్వహించినవ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.కార్యక్రమంలో తొలుత స్కౌటింగ్ ఉద్యమ పితామహుడు లార్డ్ బాడెన్ పావెల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. అనంతరం స్కౌట్ పతాకాన్ని ఎగురవేసి వందన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అన్నమయ్య జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే నైతిక విలువలు, క్రమశిక్షణ, సేవాభావం, సమాజం పట్ల బాధ్యతను పెంపొందించడంలో స్కౌటింగ్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు స్కౌట్స్ అండ్ గైడ్స్ అందించే సేవలు సమాజానికి ఎంతో విలువైనవని తెలిపారు.అనంతరం వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ సందర్భంగా సందేశమిచ్చారు.ఈ కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్లు మార్ల ఓబుల్ రెడ్డి, మహమ్మద్ రఫీ, నితిన్ రెడ్డి, గైడ్ కెప్టెన్ మధుమతి, స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

టక్కోలు,పొన్నవోలులో భారీ మెజారిటీతో విజయం

● స్వతంత్ర అభ్యర్థి సింగం పద్మావతి..టీడీపీ అభ్యర్థి జ్యోతి శివారెడ్డి గెలుపు



సిద్దవటం మన జనప్రగతి నవంబర్ 07:-సిద్దవటం మండలంలోని టక్కోలు, పొన్నవోలు ఎంపీటీసీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో భారీ మెజారిటీలతో అభ్యర్థులు విజయం సాధించారు. శనివారం కడపలోని మాంట్‌ఫోర్ట్ పాఠశాలలో జరిగిన ఓట్ల లెక్కింపులో టక్కోలు ఎంపీటీసీగా స్వతంత్ర అభ్యర్థి సింగం పద్మావతి, పొన్నవోలు ఎంపీటీసీగా టీడీపీ అభ్యర్థి జ్యోతి శివారెడ్డి గెలుపొందారు. టక్కోలులో మొత్తం 3,745 ఓట్లకు 2,661 ఓట్లు పోలయ్యాయి. సింగం పద్మావతికి 2,357 ఓట్లు, బత్తెన విజయలక్ష్మికి 201 ఓట్లు లభించగా, నోటాకు 60 ఓట్లు, 43 ఓట్లు చెల్లనివిగా నమోదయ్యాయి. దీంతో పద్మావతి 2,156 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించారు. ఆమె సిద్దవటం మండల వైసీపీ కన్వీనర్ సింగం నీలకంఠారెడ్డి సతీమణి కావడం విశేషం. పొన్నవోలులో మొత్తం 2,693 ఓట్లకు 1,196 ఓట్లు పోల య్యాయి. టీడీపీ అభ్యర్థి జ్యోతి శివారెడ్డికి 1,100 ఓట్లు, వైసీపీ అభ్యర్థి సౌరెడ్డి విజయలక్ష్మికి 86 ఓట్లు లభించాయి. నోటాకు 6 ఓట్లు, 4 ఓట్లు చెల్లనివిగా నమోదయ్యాయి. దీంతో జ్యోతి శివారెడ్డి 1,014 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. రెండు ఎంపీటీసీ స్థానాల్లోనూ భారీ మెజారిటీలతో విజయం సాధిం చడంతో ఆయా పార్టీల శ్రేణులు, మద్దతుదారులు హర్షం వ్యక్తం చేస్తూ విజేతలకు అభినం దనలు తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శనివారపు మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం,డబ్బుకే ఓటర్లు పట్టం కట్టారు

- ప్రజల్లో మార్పు రానంతవరకు ప్రజాస్వామ్యానికి ప్రయోజనం లేదు



కనిగిరి మన జనప్రగతి నవంబర్ 07:ప్రజాక్షేత్రంలో గెలుపోటములు సహజమని, అయితే ప్రజల్లో మార్పు రానంతవరకు ఎంత ప్రయత్నం చేసినా ఆశించిన ఫలితాలు సాధించడం కష్టమని కనిగిరి మండల బీసీవై పార్టీ జెడ్పీటీసీ అభ్యర్థి వంగేపురం కార్తీక్ రాజు అన్నారు. కనిగిరి మండల ప్రజలు మద్యం, డబ్బుకే ప్రాధాన్యతనిచ్చి ఓటు వేశారని ఆయన విమర్శించారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైన ఆయుధమని, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రజలకు అందించిన ఈ హక్కును మంచి చేసే పార్టీలకు, ప్రజల పక్షాన నిలిచే నాయకులకు వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్సీ, క్రైస్తవులపై దాడులు జరిగినా, బీసీ, మైనార్టీ వర్గాలపై అన్యాయాలు చోటుచేసుకున్నా ప్రజల్లో ఆశించిన స్థాయిలో చైతన్యం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నా ప్రజలు ఆలోచించి ఓటు వేయడం లేదని పేర్కొన్నారు. ప్రజలు తమ ఓటు విలువను గుర్తించి, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవాలని సూచించారు.ఎన్నికల్లో గెలుపోటములతో సంబంధం లేకుండా నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం కొనసాగిస్తానని కార్తీక్ రాజు స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో బీసీవై పార్టీని మరింత బలోపేతం చేస్తూ, బోడె రామచంద్రన్న యాదవ్ నాయకత్వంలో పనిచేస్తానని తెలిపారు.

బ్యాంకు ఉద్యోగాలపై అవగాహన కార్యక్రమం



రాయచోటి మన జనప్రగతి నవంబర్ 07: రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్యశాస్త్ర విభాగం మరియు జేకేసీ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాంకు ఉద్యోగాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. శ్రీనివాసులు రావు సూచనల మేరకు వాణిజ్యశాస్త్ర విభాగం మరియు జేకేసీ కోఆర్డినేటర్లు ఎస్.యు. ప్రసాద్, పి. సుధీర్ కుమార్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాయచోటి కెనరా బ్యాంక్ మేనేజర్ మస్తాన్ వల్లి హాజరై విద్యార్థులకు బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగ అవకాశాలు, బ్యాంకు పరీక్షల విధానం, అర్హతలు,పరీక్షల సన్నద్ధత, బ్యాంకింగ్ రంగంలో కెరీర్ అవకాశాల గురించి వివరించారు. విద్యార్థులు బ్యాంకు ఉద్యోగాలను లక్ష్యంగా చేసుకొని క్రమశిక్షణతో చదవాలని, ప్రస్తుత పోటీ పరీక్షలకు తగిన విధంగా సన్నద్ధం కావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎస్.ఫరూక్ బాషా,పి.చైతన్య,ఎస్.శ్రీనివాసులు పాల్గొన్నారు. కళాశాలలోని బి.కాం విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని బ్యాంకింగ్ రంగానికి సంబంధించిన పలు విషయాలను తెలుసుకున్నారు.

మానవత్వంతో అంతిమ వీడ్కోలు పలికిన మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్



ప్రొద్దుటూరు మన జనప్రగతి నవంబర్ 07:-ప్రొద్దుటూరు గవర్నమెంట్ హాస్పిటల్ నందు రాజశేఖర్ రెడ్డి అనే వ్యక్తి అనారోగ్యం చేత మరణించగ అంతిమ సంస్కరణలు చేయడానికి బందువులు ఎవరు ముందుకు రాకపోవడంతో హాస్పిటల్ సిబ్బంది ఫోన్ ద్వారా మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ టౌన్ ప్రెసిడెంట్ సుబహాన్ ను సంప్రదించగా వారు వెంటనే స్పందించి శనివారం హిందు స్మశాన వాటికలో హిందూ సంప్రదాయం ప్రకారంగా అంతిమ సంస్కరణలు నిర్వహించారు. ఇటువంటి గొప్ప కార్యక్రమానికి చేయూత అందించిన ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణ్ రావు,టౌన్ ప్రెసిడెంట్ సుబహాన్ ,అహమద్ హుస్సేన్, ట్రెజరర్ భార్గవ సాయి, సతీష్, సుమన్ (స్వరకల్పన ఈవెంట్స్), గౌస్ పాల్గొని అంత్యక్రియలను పూర్తి చేశారు.చైర్మన్ మోరే లక్ష్మణ్ రావు మాట్లాడుతూ సమాజంలో ఎవరూ లేని వారికి కూడా గౌరవ ప్రదమైన అంతిమ సంస్కారాలు జరగాలని ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమం చేపట్టామని వారు తెలిపారు. మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ నిరంతరం ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపడుతూ, అవసరంలో ఉన్న వారిక అండగా నిలుస్తుందని ఫౌండేషన్ సభ్యులు పేర్కొన్నారు. మా శ్రీ అమ్మ శరణాలయం లోని వృద్దులకు సహాయం చేయదలచిన ఎవరైనా దాతలు ఉంటే ఈ నెంబర్లను 82972 53484, 9182244150 సంప్రదించాలని ఆయన కోరారు.

స్నేహిత అమృత హస్తం నూతన భవన నిర్మాణానికి రూ.20 వేల విరాళం

- భవన నిర్మాణానికి వ్యాపారవేత్త హరినాథ్ చేయూత
- దాతల సహకారం స్ఫూర్తిదాయకం: సేవాసమితి అధ్యక్షులు రాజు



పులివెందుల అర్బన్ మన జనప్రగతి నవంబర్ 07:పులివెందుల పట్టణంలో ప్రజా సేవను మరింత విస్తృతం చేసేందుకు 'స్నేహిత అమృత హస్తం సేవాసమితి' చేపట్టిన నూతన భవన నిర్మాణానికి దాతల నుంచి విశేష స్పందన లభిస్తోంది.ఇందులో భాగంగా స్థానిక కడప రోడ్డు, హనుమాన్ నగర్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కొమెర హరినాథ్ శనివారం రూ. 20,000 (ఇరవై వేల రూపాయలు) విరాళాన్ని అందజేశారు.పట్టణంలోని జగనన్న కాలనీకి వెళ్లే 100 అడుగుల రోడ్డు మార్గంలో ఈ సేవా భవనాన్ని నిర్మిస్తున్నారు.ఈ భవనం అందుబాటులోకి వస్తే ఉచిత విద్యా కార్యక్రమాలు, నేత్రదాన అవగాహన సదస్సులు,నేత్రదాన సేకరణ కేంద్రం,నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణతో పాటు మహిళలు,యువతకు స్వయం ఉపాధి శిక్షణా తరగతులు సమర్థవంతంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా సేవాసమితి అధ్యక్షులు రాజు మాట్లాడుతూ సమాజ హితమే ధ్యేయంగా చేపట్టిన సొంత భవన నిర్మాణానికి కొమెర హరినాథ్ అందించిన ఆర్థిక సాయం ఎంతో విలువైనదని కొనియాడారు. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు నిరంతరాయంగా సాగాలంటే సొంత భవనం ఆవశ్యకత ఎంతో ఉందని,భవన నిర్మాణంలో భాగస్వాములవుతున్న దాతలందరికీ కృతజ్ఞతలు తెలిపారు.సేవాభిమానులు తమవంతు సహకారం అందించి ఈ బృహత్తర సంకల్పానికి చేయూతనివ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ వేలం పాటలను తక్షణమే నిలిపివేయాలి

- నిరసన ర్యాలీలో ముమ్మారెడ్డి ప్రేమ కుమార్



కూకట్ పల్లి మన జనప్రగతి నవంబర్ 07:-కేపీహెచ్‌బీ కాలనీ లో ప్రభుత్వం చేపడుతున్న స్థలాల వేలం పాటలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర జాయింట్ కమిటీ కన్వీనర్ మరియు కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ నాయకత్వంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.ప్రజా ప్రయోజనాలను పక్కనబెట్టి ప్రభుత్వ స్థలాలను వేలం వేయడాన్ని నిరసిస్తూ ఈ కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ గారు మాట్లాడుతూ..స్థానిక ప్రజల అవసరాలకు కోసం సేకరించిన ఫిష్ మార్కెట్ పక్కన ఉన్నా స్థలం మరియు ట్రక్ పార్క్ స్థలాన్ని మరియు పబ్లిక్ పార్కులు, ఆసుపత్రులు, పాఠశాలలు, పెట్రోల్ బంక్ కి కేటాయించినటువంటి ప్రజా ఉపయోగకరమైన పనులకు వినియోగించాల్సిన స్థలాలను ప్రభుత్వం వేలం పేరిట విక్రయించడం సరికాదన్నారు. ప్రజా ఆస్తులను కాపాడటమే ధ్యేయంగా తమ పోరాటం కొనసాగుతుందని, వేలం ప్రక్రియను రద్దు చేసే వరకు నిరసనలు ఆపేది లేదని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజక కో ఆర్డినేటర్లు కొల్లా శంకర్, వేముల మహేష్, బోగాది వెంకటేశ్వర్ రావు, నాగేంద్ర, పండుగ సూర్య, అశోక్ మాదాసు,డి.వెంకట్, శ్రీనివాస్ గోవింద్, అంజి, పవన్, ప్రసన్న ఆంజనేయులు,సుదర్శన్, రాము, ప్రసాద్ నాయుడు, మురళి, ప్రసాద్, శివశంకర్,శేకర్, గోపి, నీరజ్ తదితరులు పాల్గొన్నారు.

గండి క్షేత్రంలో యాచకులు, భక్తులకు అల్పాహారం పంపిణీ



వేంపల్లె మన జన ప్రగతి నవంబర్ 07:-బండపల్లి పుల్లారెడ్డి 6వ వర్ధంతిని పురస్కరించుకుని గండి క్షేత్రంలో యాచకులు, భక్తులకు అల్పాహారం పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పుల్లారెడ్డి కుటుంబ సభ్యులు గండి క్షేత్రానికి చేరుకుని ఆయన జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా గండి క్షేత్రానికి విచ్చేసిన యాచకులకు, భక్తులకు అల్పాహారాన్ని పంపిణీ చేశారు. దివంగత బండపల్లి పుల్లారెడ్డి ఆశయాలను స్మరించుకుంటూ, ఆయన వర్ధంతి సందర్భంగా పేదలకు, భక్తులకు సేవ చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా దివంగతుల జ్ఞాపకాలను చిరస్మరణీయంగా నిలుపుకోవచ్చని ఈ సందర్భంగా పేర్కొన్నారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బండపల్లి పుల్లారెడ్డి కుమారుడు బండపల్లి శివకేశవరెడ్డి, ఉత్తమారెడ్డి, ఓబుల్ రెడ్డి, షరీఫ్, రితిక రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లి జెడ్పిటిసిగా వైకాపా అభ్యర్థి బత్తల వెంకట శివమ్మ గెలుపు

- 19,192 ఓట్ల మెజార్టీతో జడ్పిటిసి అభ్యర్థి శివమ్మ గెలుపు





వేంపల్లె మన జనప్రగతి నవంబర్ 07:-ప్రాదేశిక ఎన్నికలకు సంబంధించి వేంపల్లి జడ్పిటిసి స్థానం నుంచి జనసేన పార్టీ అభ్యర్థి బెస్త లక్ష్మీదేవి పై పోటీకి దిగిన వైకాపా అభ్యర్థి బత్తల వెంకట శివమ్మ 19,192 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. శనివారం పులివెందుల లోని ప్రభుత్వ రమణప్ప సత్రం పాఠశాలలో జరిగిన ఎన్నికల కౌంటింగ్ లో మండల జడ్పిటిసి కి పోటీపడ్డ వారికి వచ్చిన ఓట్ల గురించి లెక్కించారు. రిటర్నింగ్ అధికారి జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి నాగ సుధా నేతృత్వంలో ఈ ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యాప్తంగా ఉన్న 17 పంచాయతీల్లో 45,942 ఓట్లు ఉండగా అందులో 28,131 ఓట్లు పోలయ్యాయి. ఓట్ల లెక్కింపులో వైకాపా అభ్యర్థి బత్తల వెంకట శివమ్మకు 23005 ఓట్లు రాగా, జనసేన పార్టీ అభ్యర్థి బెస్త లక్ష్మీదేవికి 3802 ఓట్లు వచ్చాయి. స్వతంత్ర అభ్యర్థులు గా నిలిచిన షేక్ మున్నీకి 69, షేక్ అజీరోన్ కు 190 ఓట్లు వచ్చాయి. అలాగే నోటాకు 328 ఓట్లు, 737 ఓట్లు చల్ల కుండా పోయాయి. ఈ మేరకు ఎన్నికల అధికారి నాగ సుధా వేంపల్లి జడ్పిటిసి స్థానానికి వైకాపా తరపున పోటీ చేసిన బత్తల వెంకట శివమ్మ సమీప ప్రత్యర్థి జనసేన పార్టీ అభ్యర్థి బెస్త లక్ష్మీదేవి పై 19,192 ఓట్ల మెజారిటీతో గెలుపొందింది. ఈ మేరకు రిటర్నింగ్ అధికారి గెలుపొందిన జడ్పిటిసి అభ్యర్థికి ధ్రువపత్రాన్ని అందజేశారు. గెలుపొందిన వెంకట శివమ్మ పులివెందులలో ఉన్న ఎంపీ అవినాష్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వేంపల్లి మండల నేతలు కార్యకర్తలు కష్టపడి పనిచేసి జెడ్పిటిసి స్థానాన్ని కైవసం చేసుకోవడం హర్షనీయమని ఎంపీ ప్రకటించారు. అక్కడికి వచ్చిన నాయకులందరికీ ఆయన అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వేంపల్లి మండల మాజీ ఉప ఎంపీపీ బాబా షరీఫ్, చింతల మడుగుపల్లె గుజిరి దర్బార్, మాజీ వార్డు మెంబర్ అంజి, మీసాల రవి,తదితరులు పాల్గొన్నారు.

కార్తీక మాసం సందర్భంగా దేవాలయాల దగ్గర పారిశుధ్యం పై ప్రత్యేక చర్యలు

- ప్రతిరోజూ శానిటేషన్ బ్లూప్రింట్ అమలు చేయాలి: కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్



ప్రొద్దుటూరు మన జనప్రగతి నవంబర్ 07:-ఈనెల 10వ తేదీ నుండి కార్తీక మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రొద్దుటూరు పట్టణంలోని అన్ని దేవాలయాలు మరియు వాటి పరిసర ప్రాంతాల్లో నెల రోజుల పాటు పారిశుధ్యం పై ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ పేర్కొన్నారు.కార్తీక మాసంలో భక్తులు పెద్ద సంఖ్యలో దేవాలయాలను సందర్శించే అవకాశం ఉన్నందున దేవాలయాల పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ ను ఆదేశించారు. ఈ మేరకు మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ ఆధ్వర్యంలో పట్టణంలోని అన్ని దేవాలయాల వద్ద ప్రత్యేక శానిటేషన్ బ్లూప్రింట్ ప్రకారం,నవంబర్ 10వ తేదీ నుంచి నెల రోజుల పాటు ప్రతిరోజూ అమలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా సంబంధిత పారిశుధ్య కార్మికుల ద్వారా దేవాలయాల ఆవరణలు, పరిసర రహదారులు, డ్రైనేజీలు శుభ్రం చేయించడం, చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించడం,పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతను నిరంతరం కొనసాగించడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. కార్తీక మాసంలో దేవాలయాలను సందర్శించే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరిశుభ్రమైన,ఆహ్లాదకరమైన ఆధ్యాత్మిక వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ఈ ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు కమిషనర్ తెలిపారు. సంబంధిత అధికారులు, పారిశుధ్య సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ నెల రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, ప్రతిరోజూ పారిశుధ్య పనులను పర్యవేక్షించాలని కమిషనర్ ఆదేశించారు.

19,610 ఓట్ల భారీ మెజారిటీతో మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి విజయం

- సోదరుడికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అభినందనలు..ఆత్మీయ కలయిక



రాయచోటి మన జనప్రగతి నవంబర్ 07:-చిన్నమండెం మండల జడ్పీటీసీగా 19,610 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించిన మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి శనివారం మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా తన సోదరుడు భారీ మెజారిటీతో జడ్పీటీసీగా ఎన్నిక కావడంపై మంత్రి హర్షం వ్యక్తం చేస్తూ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సోదరులిద్దరూ ఆప్యాయంగా ముచ్చటించుకున్నారు.అనంతరం పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మంత్రిని కలిసి తమ గ్రామాలు, ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వారి సమస్యలను సావధానంగా విన్న మంత్రి, పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కొద్దిసేపు ముచ్చటిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

అలిరెడ్డిపల్లె ఎంపీటీసీగా స్వతంత్ర అభ్యర్థి రామచంద్ర గెలుపు


- బిజెపి అభ్యర్థిపై స్వతంత్ర అభ్యర్థి 29 ఓట్లతో గెలుపు



వేంపల్లె మన జన ప్రగతి నవంబర్ 07:-వేంపల్లి మండలంలోని అలిరెడ్డి పల్లె ఎంపీటీసీ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన దేవర్ల రామచంద్ర తన సమీప ప్రత్యర్థి బిజెపి అభ్యర్థి ముద్ది శివకృష్ణ పై 29 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ప్రాదేశిక ఎన్నికలకు సంబంధించి వేంపల్లి మండలం లోని 18 ఎంపీటీసీ స్థానాలకు గాను 17 ఎంపీటీసీ స్థానాలు ఇదివరకే కూటమి పార్టీలకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. శనివారం పులివెందుల లోని రమణప్ప సత్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ఈ ఎంపీటీసీ పరిధిలో జరిగిన ఓట్ల ను అధికారులు లెక్కించారు. ఈ పంచాయతీ పరిధిలోని అలిరెడ్డి పల్లె, తువ్వ పల్లెలో 875 ఓట్లు ఉండగా 692 ఓట్లు పోలయ్యాయి. ఇందులో స్వతంత్ర అభ్యర్థి దేవర్ల రామచంద్ర కు 323 ఓట్లు రాగా, బిజెపి అభ్యర్థి ముద్ది శివకృష్ణకు 294 ఓట్లు వచ్చాయి. నోటాకు 30 ఓట్లు, 45 ఓట్లు చల్లకుండా పోయాయి. దీంతో ఇండిపెండెంట్ అభ్యర్థి దేవర్ల రామచంద్ర తన సమీప ప్రత్యర్థి బిజెపి అభ్యర్థి ముద్ది శివకృష్ణ పై 29 ఓట్లతో గెలుపొందారు. ఈ మేరకు ఎన్నికల అధికారి నాగసుధ చేతులమీదుగా అలి రెడ్డి పల్లె గ్రామ తెదేపా ఇన్చార్జి ఏమి రెడ్డి బాలకృష్ణారెడ్డి సమక్షంలో దేవర్ల రామచంద్ర ఎంపీటీసీగా గెలుపొందినట్లు ధ్రువపత్రం అందుకున్నారు. బిజెపి, తెదేపా పొత్తులో భాగంగా జరిగిన పొరపాట్ల కారణంగా తెదేపా అభ్యర్థిగా నామినేషన్ వేసి ఇండిపెండెంట్గా నిలిచిన దేవర్ల రామచంద్ర ఎట్టకేలకు ఈ ఎంపీటీసీ స్థానం నుంచి గెలుపొందారు.

100వ ఏట అడుగుపెడుతున్న భారతరత్న, బీజేపీ సీనియర్ నేత లాల్‌కృష్ణ అడ్వాణీ

- భారత రాజకీయాల్లో విశిష్ట ప్రస్థానం
- దేశానికి ఆయన సేవలు చిరస్మరణీయం



న్యూఢిల్లీ, మన జనప్రగతి, నవంబర్ 07:- భారతరత్న, బీజేపీ సీనియర్ నేత లాల్‌కృష్ణ అడ్వాణీ నవంబర్ 8న తన 100వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్నారు. 1927 నవంబర్ 8న జన్మించిన ఆయన భారత రాజకీయ చరిత్రలో కీలక పాత్ర పోషించారు.రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రచారక్‌గా ప్రస్థానం ప్రారంభించిన అడ్వాణీ, జనసంఘ్ బలోపేతానికి, భారతీయ జనతా పార్టీ నిర్మాణానికి విశేష కృషి చేశారు. అటల్ బిహారీ వాజ్‌పేయితో కలిసి పార్టీ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. 1989లో బీజేపీ జాతీయ అధ్యక్ష బాధ్యతలు చేపట్టి పార్టీని బలోపేతం చేశారు.1970లో పార్లమెంటరీ ప్రస్థానం ప్రారంభించిన ఆయన సమాచార, ప్రసార శాఖ మంత్రిగా, హోంమంత్రిగా, ఉప ప్రధానమంత్రిగా పలు కీలక పదవులు నిర్వహించారు. ఎమర్జెన్సీ సమయంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడారు. సోమనాథ్ నుంచి అయోధ్య వరకు చేపట్టిన రథయాత్ర భారత రాజకీయాల్లో చారిత్రక ఘట్టంగా నిలిచింది.సైద్ధాంతిక నిబద్ధత, నిరాడంబరత, క్రమశిక్షణ, అధ్యయనశీలత ఆయన ప్రత్యేకతలుగా నిలిచాయి. దేశానికి అందించిన సేవలకు గుర్తింపుగా 2024లో కేంద్ర ప్రభుత్వం ఆయనకు భారతరత్న పురస్కారం ప్రదానం చేసింది.వందో సంవత్సరంలోకి అడుగుపెడుతున్న అడ్వాణీ ఆయురారోగ్యాలతో ఉండాలని, భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలవాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

మైలవరం ఎంపీటీసీ 2గా పసుపులేటి రేణుక ఘన విజయం




మైలవరం మన జనప్రగతి నవంబర్ 07 :- స్థానిక సంస్థల ఎన్నికలలో కూటమి ఎంపీటీసీ అభ్యర్థి పసుపులేటి రేణుక అపార ప్రజాదరణతో ఘన విజయం సాధించారు. ఓట్ల లెక్కింపు ప్రారంభం నుంచే తన ఆధిక్యతను ప్రదర్శించిన ఆమె, ప్రత్యర్థిపై భారీ మెజార్టీతో విజయం సాధించి ఎంపీటీసీగా ఎన్నికయ్యారు. ఏపీఎంపీ రాష్ట్ర కార్యదర్శి, సీనియర్ జర్నలిస్ట్ పసుపులేటి చైతన్య సతీమణి రేణుక. ఈ సందర్భంగా విజేత పసుపులేటి రేణుక మాట్లాడుతూ తనపై నమ్మకంతో గెలిపించిన మండల ప్రజలకు, నియోజకవర్గ నాయకులకు, కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు శ్రేయోభిలాషులకు నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా, గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తాను. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్తాను" అని తెలిపారు.ఈ విజయం కూటమి నాయకులు, కార్యకర్తల కష్టానికి, ప్రజలు చూపిన అభిమానానికి నిదర్శనమని పార్టీ నాయకులు కొనియాడారు. విజయం సాధించిన పసుపులేటి రేణుక కి మండల ప్రజలు, కూటమి శ్రేణులు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలియజేశారు


ఆరు బూత్‌లపై అభ్యంతరాలు..అయినా వైసీపీదే వేముల పీఠం..!

● 1,569 ఓట్ల మెజారిటీతో నాగేళ్ల సత్యప్రభావతమ్మ విజయకేతనం ● ఆరు కేంద్రాల్లో సక్రమంగా పోలింగ్ జరిగి ఉంటే మరింత భారీ ఆధిక్యం వచ్చేదా..? ● గెలుపు కోసం శ్రమించిన ప్రతి కార్యకర్తకు సత్యప్రభావతమ్మ కృతజ్ఞతలు ● కార్యకర్తలతో మమేకమై ప్రచారం చేసిన నాగేళ్ల సాంబశివరెడ్డి,కుటుంబ సభ్యులు ● ఫలితంపై ప్రజల్లో ఆసక్తికర చర్చ..రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్



వేముల మన జనప్రగతి నవంబర్ 07:- వేముల మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గం (జెడ్పీటీసీ) స్థానాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది.ఆ పార్టీ అభ్యర్థి నాగేళ్ల సత్యప్రభావతమ్మ 1,569 ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బొగ్గుల విజయలక్ష్మిపై స్పష్టమైన ఆధిక్యాన్ని సాధించి జెడ్పీటీసీ స్థానాన్ని దక్కించుకున్నారు. ఈ విజయంతో వైసీపీ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి.శనివారం నిర్వహించిన ఓట్ల లెక్కింపులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నాగేళ్ల సత్యప్రభావతమ్మకు 9,040 ఓట్లు లభించగా,తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బొగ్గుల విజయలక్ష్మికి 7,471 ఓట్లు వచ్చాయి. ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులకు వరుసగా 21, 7 ఓట్లు నమోదయ్యాయి. నోటాకు 131 ఓట్లు రాగా, 389 ఓట్లు చెల్లనివిగా అధికారులు గుర్తించారు. మొత్తం 17,074 ఓట్లు నమోదవగా, వైసీపీ అభ్యర్థి 1,569 ఓట్ల ఆధిక్యంతో విజయాన్ని అందుకున్నారు.**విజయం వెనుక కుటుంబ సభ్యుల సమష్టి కృషి..**నాగేళ్ల సత్యప్రభావతమ్మ విజయం వెనుక కుటుంబ సభ్యుల ప్రచారం, కార్యకర్తలతో మమేకమై సాగించిన సమష్టి కృషి కీలకంగా నిలిచిందని పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. వైసీపీ మండల కన్వీనర్ నాగేళ్ల సాంబశివరెడ్డితో పాటు విశ్వేశ్వర్ రెడ్డి,హర్షవర్ధన్ రెడ్డి,హరినాథ్ రెడ్డిలు ప్రతి కార్యకర్తతో సన్నిహితంగా ఉంటూ ఎన్నికల ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్లారు.గ్రామగ్రామాన పార్టీ శ్రేణులను సమన్వయం చేస్తూ, కార్యకర్తల్లో ఉత్సాహం నింపుతూ సాగించిన ప్రచారం ఓట్ల రూపంలో మంచి ఫలితాన్ని అందించిందని స్థానిక రాజకీయ వర్గాల్లో అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తల సమష్టి కృషి ఈ విజయానికి దోహదపడిందనే చర్చ సాగుతోంది.**ఆరు పోలింగ్ కేంద్రాల నిర్వహణపై అభ్యంతరాలు..**వేముల మండల కేంద్రంలోని ఆరు పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణపై పోలింగ్ సమయంలోనే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వర్గాల నుంచి అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి.ఈ కేంద్రాలను టీడీపీకి చెందిన వ్యక్తులు తమ ఆధీనంలోకి తీసుకుని ఏకపక్షంగా పోలింగ్ నిర్వహించారంటూ వైసీపీ వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఈ పరిణామాలు అప్పట్లోనే స్థానికంగా చర్చకు దారితీశాయి.**సక్రమంగా పోలింగ్ జరిగి ఉంటే మరింత భారీ మెజారిటీనా..?**మండల కేంద్రంలోని ఆరు పోలింగ్ కేంద్రాల్లో సక్రమంగా,ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగి ఉంటే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మరింత అధిక మెజారిటీతో భారీ విజయాన్ని సొంతం చేసుకునేవారని విశ్వసనీయ వర్గాలు, స్థానిక ప్రజానీకం చర్చించుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే 1,569 ఓట్ల మెజారిటీ సాధించిన నేపథ్యంలో ఈ అంశం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది.**విజేతకు ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, వైఎస్ భాస్కర్ రెడ్డి అభినందనలు..**వేముల జెడ్పీటీసీగా ఘన విజయం సాధించిన నాగేళ్ల సత్యప్రభావతమ్మకు కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డి, వైఎస్ భాస్కర్ రెడ్డిలు అభినందనలు తెలిపారు. ఆమె విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా ఆమెకు అభినందనలు తెలుపుతున్నారు. **కార్యకర్తల కష్టానికి దక్కిన విజయం..కృతజ్ఞతలు తెలిపిన సత్యప్రభావతమ్మ** తన విజయం కోసం అహర్నిశలు శ్రమించిన





పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మద్దతుదారుల ందరికీ నాగేళ్ల సత్యప్రభావతమ్మ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల ప్రచారం నుంచి పోలింగ్, ఓట్ల లెక్కింపు వరకు తన గెలుపు కోసం కష్టపడిన ప్రతి ఒక్కరి సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. కార్యకర్తల కృషి, కుటుంబ సభ్యుల సహకారం, పార్టీ శ్రేణుల సమష్టి ప్రయత్నాలతోనే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. తనపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించిన వేముల మండల ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు.

వైసీపీ శ్రేణుల్లో విజయోత్సాహం..

నాగేళ్ల సత్యప్రభావతమ్మ విజయం ప్రకటిం చగానే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. పార్టీ శ్రేణులు విజయోత్సవాలు నిర్వహించి విజేతకు అభినందనలు తెలిపారు. మొత్తానికి వేముల జెడ్పీటీసీ ఎన్నికల్లో వైసీపీ సాధించిన విజయం, నాగేళ్ల సాంబశి వరెడ్డి కుటుంబ సభ్యుల ప్రచార శైలి, కార్యకర్తల సమష్టి కృషి, ఆరు పోలింగ్ కేంద్రాల నిర్వహణపై వ్యక్తమవుతున్న అభ్యంతరాలు మండల రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.

బొమ్మనహాల్ మండలంలో టీడీపీ ప్రభంజనం..15 స్థానాల్లో ఘన విజయం

● 16 ఎంపీటీసీ స్థానాలకు గాను 15 చోట్ల టీడీపీ జయకేతనం..ఒక్క స్థానంలో వైసీపీ విజయం



బొమ్మనహాల్ మన జనప్రగతి నవంబర్ 07:-బొమ్మనహాల్ మండలంలో జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘన విజయాన్ని సాధించింది, మండలంలోని మొత్తం 16 ఎంపీటీసీ స్థానాలకు గాను 15 స్థానాల్లో టీడీపీ అభ్యర్థులు విజయం సాధించగా,ఒక్క స్థానంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గెలుపొందారు దీంతో మండలంలో టీడీపీ తన ఆధిపత్యాన్ని చాటుకుంది.గ్రామాల వారీగా టీడీపీ అభ్యర్థులు సాధించిన మెజారిటీ వివరాలు ఇలా ఉన్నాయి. నేమకల్లులో 341 ఓట్లు, దర్గాహొన్నూరు-1లో 540 ఓట్లు, గోవిందవాడ-1లో 563 ఓట్లు, గోవిందవాడ-2లో 370 ఓట్లు, కురువల్లిలో 246 ఓట్లు, బొమ్మనహాల్‌లో 1,737 ఓట్లు, బొల్లనగుడ్డంలో 562 ఓట్లు, బండూరులో 554 ఓట్లు, శ్రీధరగట్టలో 679 ఓట్లు, ఉప్పరహాల్‌లో 102 ఓట్లు, దర్గాహొన్నూరు-2లో 344 ఓట్లు, లింగదహాల్‌లో 223 ఓట్లు, ఉంతకల్లులో 150 ఓట్లు, సింగేపల్లిలో 400 ఓట్లు, ఉద్దేహాల్‌లో 1,450 ఓట్ల మెజారిటీతో టీడీపీ అభ్యర్థులు విజయం సాధించారు.కొలగానహళ్లిలో మాత్రం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి 51 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.మొత్తంగా 16 స్థానాలకు గాను 15 స్థానాలను కైవసం చేసుకోవడంతో టీడీపీ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి.

పత్తికొండలో కూటమి క్లీన్‌స్వీప్..టీడీపీ ప్రభంజనం.!

జడ్పీటీసీగా కుక్కల సాంబశివారెడ్డి ఘన విజయం.. 11,654 ఓట్ల భారీ మెజారిటీ

24,486 ఓట్లు సాధించిన టీడీపీ అభ్యర్థి.. వైకాపాకు 12,832 ఓట్లు

20 ఎంపీటీసీ స్థానాల్లో కూటమి పార్టీలదే ఆధిపత్యం

12 స్థానాల్లో టీడీపీ విజయం.. ఆరు ఏకగ్రీవం

జనసేన, బీజేపీ ఖాతాలో చెరో ఎంపీటీసీ స్థానం



పత్తికొండ మన జనప్రగతి నవంబర్ 07:-పత్తికొండ మండల పరిషత్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ సత్తా చాటింది. జడ్పీటీసీ ఎన్నికతో పాటు ఎంపీటీసీ స్థానాల్లోనూ కూటమి పార్టీలు ఆధిక్యత ప్రదర్శించాయి. జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి కుక్కల సాంబశివారెడ్డి 11,654 ఓట్ల భారీ మెజారిటీతో ఘన విజయం సాధించగా, మండలంలోని 20 ఎంపీటీసీ స్థానాల్లో టీడీపీ 18 స్థానాలను తన ఖాతాలో వేసుకుంది. ఇందులో ఆరు స్థానాలు ఏకగ్రీవం కాగా, ఓట్ల లెక్కింపులో 12 స్థానాల్లో విజయం సాధించింది. జనసేన, బీజేపీ అభ్యర్థులు చెరో స్థానాన్ని దక్కించుకున్నారు. దీంతో పత్తికొండ మండలంలో కూటమి పార్టీల ఆధిపత్యం స్పష్టమైంది.**జడ్పీటీసీ ఎన్నికల్లో భారీ మెజారిటీ..**పత్తికొండ మండల జడ్పీటీసీ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో కలిపి మొత్తం 38,864 ఓట్లు పోలయ్యాయి. వీటిలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కుక్కల సాంబశివారెడ్డికి 24,486 ఓట్లు లభించగా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీరంగడుకు 12,832 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీనివాసులుకు 302 ఓట్లు నమోదయ్యాయి. చెల్లని ఓట్లు 923, నోటాకు 321 ఓట్లు పోలయ్యాయి. ప్రత్యర్థిపై 11,654 ఓట్ల ఆధిక్యంతో కుక్కల సాంబశివారెడ్డి జడ్పీటీసీగా విజయం సాధించారు. భారీ మెజారిటీతో ఆయన గెలుపొందడం టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది.**ఆరు ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవం..** మండలంలోని మొత్తం 20 ఎంపీటీసీ స్థానాలకు గాను నలకదొడ్డి, పందికోన, పుచ్చకాయలమాడ, పత్తికొండ-2, పత్తికొండ-3, పత్తికొండ-4 స్థానాలను టీడీపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా కైవసం చేసుకున్నారు. దీంతో ఓట్ల లెక్కింపుకు ముందే ఆరు స్థానాలు టీడీపీ ఖాతాలో చేరాయి.**ఓట్ల లెక్కింపులోనూ టీడీపీ హవా..**ఓట్ల లెక్కింపులోనూ తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు విజయపరంపర కొనసాగించారు. చక్కరాళ్లలో రమేష్ 762 ఓట్ల మెజారిటీతో, కోతిరాళ్లలో తలారి నగేష్ 123 ఓట్లతో, చందోలిలో రవీంద్ర నాయక్ 305 ఓట్లతో విజయం సాధించారు. పత్తికొండ-6లో పద్మావతి 386 ఓట్లతో, పత్తికొండ-5లో గీత 501 ఓట్లతో, చిన్నహుల్తిలో దాసరి జయలక్ష్మి 14 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.పత్తికొండ-1లో చెక్క శిల్పాశెట్టి 1,200 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించగా, పత్తికొండ-7లో వెంకటలక్ష్మి 631 ఓట్లతో, జూటూరులో రాజు 172 ఓట్లతో గెలుపొందారు. దూదేకొండలో కొల్ల మల్లక్క 628 ఓట్ల మెజారిటీతో, హోసూరు-2లో అపర్ణదేవి 157 ఓట్లతో విజయం సాధించారు.**జనసేన, బీజేపీకి చెరో స్థానం..**కూటమిలో భాగస్వామ్య పార్టీలైన జనసేన, బీజేపీ కూడా ఎంపీటీసీ స్థానాలను దక్కించుకున్నాయి. పులికొండ ఎంపీటీసీ స్థానంలో జనసేన అభ్యర్థి సౌజన్య 114 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. హోసూర్ ఎంపీటీసీ స్థానంలో బీజేపీ అభ్యర్థి బ్రహ్మయ్య గెలుపొందారు.

పత్తికొండలో రాజకీయంగా ఆసక్తికర ఫలితాలు..

జడ్పీటీసీ ఎన్నికల్లో భారీ మెజారిటీ, ఎంపీటీసీ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు కైవసం చేసుకోవడంతో పత్తికొండ మండలంలో టీడీపీ తన ఆధిక్యతను చాటుకుంది. జడ్పీటీసీగా కుక్కల సాంబశివారెడ్డి విజయం సాధించడంతో పాటు, ఎంపీటీసీ స్థానాల్లోనూ కూటమి అభ్యర్థులు మెజారిటీ స్థానాలను దక్కించుకోవడం స్థానిక రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. ఎన్నికల ఫలితాలతో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల్లో సంబరాలు నెలకొన్నాయి.

బొమ్మనహాల్‌లో టీడీపీ ప్రభంజనం..

16కు 15 స్థానాలు కైవసం..!

- ప్రత్యర్థులకు భారీ షాక్..ఒక్క స్థానానికే పరిమితమైన వైఎస్సార్‌సీపీ

బొమ్మనహాల్ మన జనప్రగతి నవంబర్ 07:-బొమ్మనహాల్ మండలంలో తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించింది. మొత్తం 16 ఎంపీటీసీ స్థానాలకు గాను ఏకంగా 15 స్థానాలను కైవసం చేసుకుని తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. వైఎస్సార్‌సీపీ కేవలం ఒక్క స్థానానికే పరిమితం కావడంతో మండలంలో టీడీపీ రాజకీయంగా పైచేయి సాధించింది.గ్రామాల వారీగా టీడీపీ అభ్యర్థులు భారీ మెజారిటీలతో విజయాలు నమోదు చేశారు. నేమకల్లులో 341, దర్గాహొన్నూరు-1లో 540, గోవిందవాడ-1లో 563, గోవిందవాడ-2లో 370, కురువల్లిలో 246, బొమ్మనహాల్‌లో 1,737, బొల్లనగుడ్డంలో 562, బండూరులో 554, శ్రీధరగట్టలో 679, ఉప్పరహాల్‌లో 102, దర్గాహొన్నూరు-2లో 344, లింగదహాల్‌లో 223, ఉంతకల్లులో 150, సింగేపల్లిలో 400, ఉద్దేహాల్‌లో 1,440 ఓట్ల మెజారిటీతో టీడీపీ అభ్యర్థులు విజయకేతనం ఎగురవేశారు.మరోవైపు కొలగానహళ్లి ఎంపీటీసీ స్థానంలో మాత్రమే వైఎస్సార్‌సీపీ అభ్యర్థి 51 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. మొత్తం 16 స్థానాల్లో 15 స్థానాలను టీడీపీ దక్కించుకోవడంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఫలితాలు వెలువడిన అనంతరం పలుచోట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. మండలవ్యాప్తంగా టీడీపీ సాధించిన ఈ ఘనవిజయం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

అమృతకు బండి ఆపన్న హస్తం

● తక్షణ సాయంగా రూ.50 వేలు పంపిన కేంద్ర మంత్రి ● తక్షణమే డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయండి ● సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌ను కోరిన బండి సంజయ్ ● ఇల్లు మంజూరయ్యాక కుటుంబానికి అవసరమైన సరుకులన్నీ ఇవ్వండి



కరీంనగర్ మన జనప్రగతి నవంబర్ 07: సొంత ఇల్లు లేక స్మశానమే నివాసంగా మార్చుకుని అనారోగ్యంతో బాధపడుతున్న కుమారుడితో కలిసి దుర్భర జీవితాన్ని గడుపుతున్న చందుర్తి మండలం కిష్టంపేటకు చెందిన మర్రిపల్లి అమృతకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ బాసటగా నిలిచారు. అమృతకు తక్షణ సాయంగా రూ.50 వేలు పంపారు. ఈ నగదు మొత్తాన్ని బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి ద్వారా బాధితురాలకు అందజేశారు. దీంతోపాటు జిల్లా కలెక్టర్ గరీమా అగర్వాల్ తో కేంద్ర మంత్రి ఫోన్లో మాట్లాడుతూ అమృత దుస్థితిని వివరించారు. అమృతకు తక్షణమే డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేస్తామని తెలిపారు. మరోవైపు అనారోగ్యం బారిన పడిన కొడుకుతో కలిసి శ్మశానంలో నివసిస్తూ పుట్టెడు దుఃఖంలో ఉన్న అమృతకు అన్ని విధాలా అండగా ఉండాలని బండి సంజయ్ పార్టీ శ్రేణులను ఆదేశించా రు. డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరైన వెంటనే ఆ ఇంటికి అవసరమైన సామాగ్రితోపాటు కుటుంబానికి సరిపడా నిత్యావసర సరుకులను అందించాలని కోరారు.

రాజ్యాధికార సాధనకు వేదికలుగా ఆత్మగౌరవ భవనాలు నిలవాలి

- రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య, బీసీ జాతీయ నేత గుజ్జ సత్యం



హైదరాబాద్, మన జనప్రగతి నవంబర్ 07:- బీసీ ఆత్మగౌరవ భవనాలు కేవలం కుల సంఘాల సమావేశాలకే పరిమితం కాకుండా, బీసీల రాజకీయ చైతన్యానికి, రాజ్యాధికార సాధనకు కార్యాచరణ కేంద్రాలుగా మారాలని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్టసభల్లో బీసీలకు 50 శాతం, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ప్రత్యేక సబ్‌ప్లాన్ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఆత్మగౌరవ భవనాల్లో యువతకు నాయకత్వ శిక్షణ, గ్రంథాలయాలు, పోటీ పరీక్షల కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. గుజ్జ సత్యం మాట్లాడుతూ బీసీలు ఓటు బ్యాంకుగా మిగిలిపోకుండా పాలకులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు చెరుకుల రాజేందర్, భీమ్‌రాజ్, మేకల పరుశురాం, రామదేవ్ యాదవ్, తాళ్లపెల్లి మనోజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మానవ సేవే మాధవ సేవ

- చిక్కడపల్లిలో 300 మంది వితంతువులకు నిత్యావసర సరుకులు, స్వీట్ల పంపిణీ



చిక్కడపల్లి, మన జనప్రగతి, నవంబర్ 07:- సమాజంలోని నిరుపేదలు, వితంతువులకు చేయూతనివ్వడమే నిజమైన దైవసేవ అని శివసేన పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ గణేష్ గౌటే అన్నారు. చిక్కడపల్లిలో వికాస్ కుమార్ జస్వాల్ ఆధ్వర్యంలో సుమారు 200 నుంచి 300 మంది వితంతు మహిళలకు నిత్యావసర సరుకులు, దీపావళి స్వీట్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గణేష్ గౌటే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పండుగ వేళ మహిళలకు అండగా నిలిచిన వికాస్ కుమార్ జస్వాల్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో శివసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్, బీజేపీ నాయకుడు నర్సింగ్ గౌడ్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలకు మంత్రి అచ్చెన్నాయుడు

దీపావళి శుభాకాంక్షలు

- స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయమే ప్రజలకు ముందస్తు దీపావళి



అమరావతి, మన జనప్రగతి, నవంబర్ 07:- రాష్ట్ర ప్రజలందరికీ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి దీపావళి ప్రతీక అని, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి సాధించిన ఘనవిజయంతో రాష్ట్ర ప్రజలకు ముందుగానే దీపావళి వచ్చిందని మంత్రి వ్యాఖ్యానించారు. ప్రజలు తమ ఓట్ల ద్వారా వైసీపీ రాజకీయ అహంకారానికి తగిన సమాధానం చెప్పారని పేర్కొన్నారు. పులివెందులలోనూ వైసీపీకి ఎదురైన పరాజయం ప్రజల్లో ఆ పార్టీ పట్ల ఉన్న వ్యతిరేకతకు నిదర్శనమని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం దిశగా ముందుకు సాగాలని, రైతులు, కార్మికులు, మహిళలు, యువత జీవితాల్లో దీపావళి కొత్త వెలుగులు నింపాలని మంత్రి ఆకాంక్షించారు.

వ్యర్థాల నియంత్రణ ప్రతిఒక్కరి ప్రాథమిక బాధ్యత

- సుస్థిర జీవనశైలిపై యోగి వేమన విశ్వవిద్యాలయంలో అవగాహన సదస్సు



కడప, మన జనప్రగతి, నవంబర్ 07:- వ్యర్థాల ఉత్పత్తిని తగ్గించడం, పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి ప్రాథమిక బాధ్యత అని యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి. శ్రీనివాస్ అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయంలో బ్రిక్స్ ఆధ్వర్యంలో "సుస్థిర జీవనశైలి వ్యర్థాల తగ్గింపు" అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ ఎన్.వి. రెడ్డి మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి, తడి చెత్తతో సేంద్రియ ఎరువులు తయారు చేయాలని సూచించారు. బ్రిక్స్ నోడల్ ఆఫీసర్ ప్రొఫెసర్ ఎం. సుభోష్ చంద్ర మాట్లాడుతూ విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై సమాజంలో అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ మృత్యుంజయరావు, డాక్టర్ శ్రీనివాసరావు, ఫైన్ ఆర్ట్స్ విభాగ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

14వ వార్డు సమస్యలపై కౌన్సిలర్‌కు వినతిపత్రం

● సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్న బి. మంజుల జనార్దన్ రెడ్డి



పటాన్‌చెరు, మన జనప్రగతి, నవంబర్ 07:- 14వ వార్డులో నెలకొన్న మౌలిక సదుపాయాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక నివాసితులు కౌన్సిలర్ బి. మంజుల జనార్దన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీధికుక్కల బెడద, తాగునీటి సరఫరా, రోడ్ల అభివృద్ధి, పారిశుధ్య సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ప్రమాదకరంగా మారిన 11 కేవీ విద్యుత్ స్తంభాన్ని వెంటనే మరమ్మతు చేయాలని లేదా కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై కౌన్సిలర్ స్పందిస్తూ సమస్యలన్నింటినీ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వార్డు అభివృద్ధికి స్థానికులతో సమన్వయంగా పనిచేస్తానని తెలిపారు.

సాయినగర్‌లో పార్కు ఓపెన్ జిమ్ ఏర్పాటుకు వినతి

- మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన బూరుగడ్డ పుష్పనగేష్



పటాన్ చెరువు మన జనప్రగతి, నవంబర్ 07:- రామచంద్రపురం డివిజన్‌లోని కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు సాయినగర్ కాలనీలో ఖాళీ స్థలానికి ప్రహరీ నిర్మించి పార్కు, పిల్లల ఆటస్థలం, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని కోరారు. వినతిపై కమిషనర్ సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు రవికిరణ్ గౌడ్, వీర్మెట్టి, స్థానికులు పాల్గొన్నారు.

ప్రజాతీర్పుతోనైనా జగన్ వైఖరి మార్చుకోవాలి

● పరిషత్ ఎన్నికల ఫలితాలు అభివృద్ధికి ప్రజల మద్దతును చాటుతున్నాయి: మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



బనగానపల్లె, మన జనప్రగతి, నవంబర్ 07:- జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా కూటమి అభ్యర్థులు సాధిస్తున్న విజయాలు ప్రజలు అభివృద్ధి, సంక్షేమ పాలనకు మద్దతుగా నిలుస్తున్నారని స్పష్టం చేస్తున్నాయని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. వైసీపీకి బలమైన ప్రాంతంగా భావించే రాయలసీమలోనూ కూటమి అభ్యర్థులు విజయం సాధించడం ప్రజల తీర్పుకు నిదర్శనమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల మద్దతు లభిస్తోందన్నారు. ఓటమిని అంగీకరించకుండా జగన్ విమర్శలు చేయడం సరికాదని, ప్రజాతీర్పును గౌరవించాలని సూచించారు. కూటమి అభ్యర్థులకు మద్దతు తెలిపిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా మరింత బాధ్యతతో పనిచేస్తామని మంత్రి తెలిపారు. రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ కూటమికి ప్రజల మద్దతు కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు.

ఓబులవారిపల్లెలో స్థానిక సంస్థల్లో విజయ బేరి మోగించిన పాలక పక్షం అభ్యర్థులు

ఓబులవారిపల్లి మన జనప్రగతి నవంబర్ 07:-తిరుపతి జిల్లా రైల్వే కోడూరు. నియోజకవర్గంలోని ఓబులవారిపల్లి మండలంలో జరిగిన స్థానిక సంస్థ ఎన్నికల్లో భాగంగా నేడు 9 స్థానాలు గాను అనంతరాజుపేట ఉద్యానవన కాలేజీలో నిర్వహించిన ఎంపీటీసీ మరియు జడ్పిటిసి స్థానాలకు సంబంధించి అభ్యర్థుల ఓటర్లు ఎంపికలో భాగంగా వై కోట 1. లక్ష్మీ ప్రసన్న 337 ఓట్లతో ప్రత్యర్థి పై వైసిపి పార్టీ ఎంపీటీసీ అభ్యర్థిగా విజయం సాధించారు అనంతరం వైకోట టు కొత్త పెంచలయ్య ఎనిమిది ఓట్లు మెజార్టీతో ప్రత్యర్థి పై వైసీపీ పార్టీ తరపున బాలెడ్డిపల్లి వైసీపీ అభ్యర్థి రామిరెడ్డి శివారెడ్డి విజయం సాధించారు కొర్లకుంట వైసీపీ అభ్యర్థి సంధ్యారాణి 100 ఓట్లకు పైనే టిడిపి అభ్యర్థి పై విజయం సాధించారు మంగంపేటలో జనసేన అభ్యర్థి నీ యనమల ఉమాదేవి వైసీపీ అభ్యర్థి పై అత్యధిక మెజార్టీతో జనసేన అభ్యర్థిగా విజయం సాధించారు గోవిందం పల్లి స్వతంత్ర అభ్యర్థి నీ చప్పిడి మంజుల టిడిపి అభ్యర్థి సౌజన్య పై300 మెజార్టీతో విజయం సాధించినట్లు తెలుస్తోందిబోటి మీద పల్లి స్వతంత్ర అభ్యర్థి అరుకులయ్య టిడిపి అభ్యర్థి పై నాలుగు ఓట్లు మెజార్టీతో విజయం సాధించినట్లు అధికారులు తెలిపారు ఏది ఏమైనా పూర్తి వివరాలు కొన్ని రీపోలింగ్ తదితర సమస్యలతోతెలియాల్సి ఉంది.



చెడుపై మంచి విజయం సాధించడమే దీపావళి

- దీపావళి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి మండిపల్లి

రాయచోటి మన జనప్రగతి నవంబర్ 07:-ఈ పండుగ చెడుపై మంచి, చీకటిపై వెలుగు, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి ప్రతీక దీపావళి అని రాష్ట్ర రవాణా మరియు యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఇంట్లో దీపం వెలగాలనీ, ప్రతి మనసులో ఆనందం నిండాలనీ ఈ దీపావళి జీవితాల్లో సుఖ,సంతోషాలు, ఆరోగ్యం, ఐశ్వర్యం తీసుకురావాలని కోరారు. దీపావళిని ఆనందంగా జరుపుకోవాలని పటాకులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు. దీపాల కాంతులతో ఇల్లు వెలుగొందాలని,లక్ష్మీదేవి ఆశీస్సులతో ధనధాన్యాలు వృద్ధి చెందాలని, కుటుంబంలో ఆనందం, ఆరోగ్యం ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటూ రాయచోటి నియోజకవర్గం మరియు రాష్ట్ర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

గవర్నర్ చేతుల మీదుగా డైమండ్ జూబ్లీ మెమెంటో అందుకున్న డి.శకుంతల

- అన్నమయ్య జిల్లా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు గర్వకారణం



రాయచోటి మన జనప్రగతి నవంబర్ 07:-విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అన్నమయ్య జిల్లా లీడర్ ట్రైనర్ (గైడ్స్) డి. శకుంతల అరుదైన గౌరవాన్ని అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా డైమండ్ జూబ్లీ వేడుకల మెమెంటోను స్వీకరించారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమానికి ఆమె అందిస్తున్న సేవలు, యువతలో క్రమశిక్షణ, సేవాభావం, దేశభక్తిని పెంపొందించడంలో చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ గౌరవం లభించింది. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ కార్యదర్శి ఆమెకు అభినందనలు తెలిపారు. ఈ గౌరవం జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు గర్వకారణమని పేర్కొన్నారు.

పాణ్యం మండలంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలలో టిడిపి ఘన విజయం

పాణ్యం ప్రతినిధి,మన జనప్రగతి నవంబర్ 07:
మండలంలోని ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలలో టిడిపి ఘన విజ యం సాధించినట్లు ఎలక్షన్ రిటర్నింగ్ అధికారి కమలాకర్ తెలిపారు. మండలంలోని 14 ఎంపీటీసీ స్థానాలకు గాను 9 టిడిపి, 5 వైసీపీ స్థానాలు కైవసం చేసుకున్నట్లు తెలిపారు. టిడిపికి పాణ్యం 1, పాణ్యం 2, పాణ్యం 3, పాణ్యం 4, మద్దూరు, కవులూరు, కొనిదేడు, భూపనపాడు, ఆలమూరు, వైసీపీకి తమ్మరాజు పల్లె, ఆలమూరు, నెరవాడ, కందికాయ పల్లె, గోరుకల్లు స్థానాలు కైవసం చేసుకున్నట్లు తెలిపారు. జడ్పిటిసి అభ్యర్థిగా గోరుకల్లుకు చెందినటిడిపికి అభ్యర్థి సంధ్యాల రవికుమార్ గెలుపొందారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రజలు పట్టం కట్టారు

మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



రాయచోటి మన జనప్రగతి నవంబర్ 07:- రాష్ట్రవ్యాప్తంగా జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులకు ప్రజలు ఘన విజయాన్ని అందించారని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు మద్దతు తెలిపారని పేర్కొన్నారు. శనివారం రాయచోటిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.రాయచోటి నియోజకవర్గంలో కూటమి చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసిందని మంత్రి తెలిపారు. రాయచోటి మున్సిపాలిటీలోని 44 స్థానాలను కూటమి కైవసం చేసుకుందని, మున్సిపాలిటీ ఏర్పడిన 2005 తర్వాత తొలిసారిగా టీడీపీ జెండా ఎగురవేసిందని పేర్కొన్నారు.నియోజకవర్గంలోని 67 ఎంపీటీసీ స్థానాల్లోనూ కూటమి విజయం సాధించిందన్నారు. వీటిలో 66 స్థానాలు ఏకగ్రీవం కాగా, మిగిలిన ఒక స్థానంలోనూ కూటమి అభ్యర్థి గెలుపొందారని వివరించారు. ఆరు మండలాల్లో ఎంపీపీ స్థానాలను సైతం కైవసం చేసుకున్నామని తెలిపారు.గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నియోజకవర్గానికి చేసిన అభివృద్ధిపై ఆ పార్టీ నాయకులు ఆత్మపరిశీలన చేసుకోవాలని మంత్రి సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు వైసీపీకి అభ్యర్థులు కూడా దొరకని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ప్రజలు అభివృద్ధి, సంక్షేమాన్ని కోరుకుంటున్నారని, అందుకే కూటమికి మద్దతు తెలిపారని అన్నారు.రాయచోటి అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొంటూ, వెలిగల్లు జలాశయం నుంచి రెండో దశ తాగునీటి పథకానికి రూ.119 కోట్లు, మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.36 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. జలజీవన్ మిషన్ ద్వారా 850 గ్రామాలకు తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రైతుల అవసరాల కోసం 1,200 ట్రాన్స్‌ఫార్మర్లు అందించామని వివరించారు.ప్రభుత్వ ఆసుపత్రిలో క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణం చేపట్టామని, డయాలసిస్ యూనిట్ల సంఖ్యను 10 నుంచి 25కు పెంచుతున్నామని తెలిపారు. మైనార్టీ విద్యార్థుల కోసం రూ.35 కోట్లతో పాఠశాల, హాస్టల్ భవనాల నిర్మాణాలు చేపట్టినట్లు వెల్లడించారు. పట్టణంలో రెండు అన్న క్యాంటీన్ల ద్వారా పేదలకు భోజన సదుపాయం కల్పిస్తున్నామని, నియోజకవర్గంలోని దేవాలయాల అభివృద్ధికి సుమారు రూ.48 కోట్లు మంజూరు చేయించినట్లు చెప్పారు.కూటమి విజయానికి కృషి చేసిన మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు సముచిత గుర్తింపు, గౌరవం కల్పిస్తామని హామీ ఇచ్చారు. రాబోయే పంచాయతీ ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ రాయచోటి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు.

జిల్లా ప్రజలకు కలెక్టర్ దీపావళి శుభాకాంక్షలు



కడప, మన జనప్రగతి, నవంబర్ 07:- దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, వెలుగులు నింపాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.చీకటిపై వెలుగు సాధించిన విజయానికి దీపావళి ప్రతీక అని, ఎన్ని కష్టాలు ఎదురైనా ధైర్యంగా ముందుకు సాగాలనే సందేశాన్ని ఈ పండుగ అందిస్తుందని పేర్కొన్నారు. ప్రజలందరూ కుటుంబ సభ్యులతో ఆనందంగా పండుగ జరుపుకోవాలని, టపాసులు కాల్చే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. చిన్నారులు పెద్దల పర్యవేక్షణలోనే టపాసులు కాల్చాలని, ప్రమాదాలకు తావులేకుండా సురక్షితంగా వేడుకలు జరుపుకోవాలని కలెక్టర్ కోరారు.

బాణాసంచా విక్రయ కేంద్రాల్లో భద్రతా నిబంధనలు తప్పనిసరి

- స్టాల్ నిర్వాహకులకు కడప ఆర్డీఓ మురళి సూచన



కడప, మన జనప్రగతి, నవంబర్ 07:- బాణాసంచా విక్రయ కేంద్రాల్లో ప్రభుత్వం నిర్దేశించిన భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కడప ఆర్డీఓ మురళి సూచించారు.శనివారం కడప నగరంలోని మున్సిపల్ మైదానంలో ఏర్పాటు చేసిన బాణాసంచా విక్రయ కేంద్రాలను డీఎస్పీ భవానీతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాద నివారణ చర్యలు, భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేశారు. ప్రతి స్టాల్‌లో అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచాలని, నిబంధనల ఉల్లంఘనకు తావివ్వకుండా అప్రమత్తంగా ఉండాలని నిర్వాహకులను ఆదేశించారు. వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

వేముల జడ్పీటీసీ విజయంతో వైఎస్సార్‌సీపీలో నూతనోత్సాహం..!

1,569 ఓట్ల మెజారిటీతో నాగేళ్ల సత్యప్రభావతమ్మ ఘన విజయం

గెలుపులో కీలక పాత్ర పోషించిన వేల్పుల రాము ఎన్నికల వ్యూహాలు

పార్టీ శ్రేణులను సమన్వయం చేస్తూ ముందుండిన నాగేళ్ల సాంబశివరెడ్డి

టీడీపీ నాయకుల మధ్య సమన్వయ లోపం వైకాపాకు కలిసొచ్చిందా..?





వేముల మన జనప్రగతి నవంబర్ 07:-పులివెందుల నియోజకవర్గ పరిధిలోని వేముల మండల జడ్పీటీసీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగురవేసింది. వైకాపా అభ్యర్థి నాగేళ్ల సత్యప్రభావతమ్మ 1,569 ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించారు. ఈ విజయంతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. ఎన్నికల ఫలితాల అనంతరం గెలుపునకు దోహదపడిన నాయకుల వ్యూహాలు, పార్టీ శ్రేణుల సమష్టి కృషిపై స్థానిక రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది.వేముల మండలంలో పార్టీ విజయానికి సీనియర్ నాయకుడు నాగేళ్ల సాంబ శివరెడ్డి, వేల్పుల రాము తదితర నాయకుల పాత్ర కీలకంగా నిలిచిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల ప్రకటన నుంచి నామినేషన్లు, ప్రచారం, పోలింగ్ వరకు పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడం విజయానికి దోహదపడిందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

గెలుపులో వేల్పుల రాము వ్యూహాత్మక పాత్ర..!

వేముల మండలంలో వైఎస్సార్‌సీపీ విజయానికి వేల్పుల రాము కీలక పాత్ర పోషించారనే చర్చ ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో ప్రధానంగా వినిపిస్తోంది. నామినేషన్ల సమయంలో నెలకొన్న ఉత్కంఠభరిత పరిస్థితుల నుంచి పోలింగ్ రోజు వరకు ఆయన అనుసరించిన వ్యూహాలు పార్టీకి ప్రయోజనం చేకూర్చినట్లు కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా మహిళా ఓటర్లను పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తీసుకువచ్చి ఓటు హక్కు వినియోగించుకునేలా చేయడంలో ఆయన ప్రత్యేక చొరవ చూపినట్లు పార్టీ శ్రేణులు చర్చించుకుంటున్నాయి. అంతేకాకుండా గ్రామాల వారీగా కార్యకర్తలను సమన్వయం చేసుకోవడం, ఓటర్లతో నిరంతరం సంప్రదింపులు జరపడం, పోలింగ్ ప్రక్రియలో పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండేలా చూడటంలో ఆయన కీలకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో ఆయన అనుసరించిన కార్యాచరణ వైఎస్సార్‌సీపీ విజయానికి బలమైన పునాదిగా నిలిచిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పార్టీ శ్రేణులను ముందుండి నడిపించిన నాగేళ్ల సాంబశివరెడ్డి..!

వేముల మండలానికి చెందిన సీనియర్ నాయకుడు నాగేళ్ల సాంబశివరెడ్డి సైతం ఎన్నికల సమయంలో కీలకంగా వ్యవహరించారు. పార్టీ అభ్యర్థి విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేస్తూ ప్రచార కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. గ్రామస్థాయిలో పార్టీ శ్రేణులతో సంప్రదింపులు జరుపుతూ ఎన్నికల వ్యవహారాలను పర్యవేక్షించారు. పోలింగ్ సమయంలోనూ కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తూ పార్టీ విజయానికి తనవంతు కృషి చేశారు. స్థానికంగా ఆయనకు ఉన్న రాజకీయ అనుభవం, నాయకులు, కార్యకర్తలతో ఉన్న సంబంధాలు ఎన్నికల సమయంలో ప్రాధాన్యత సంతరించుకున్నాయని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

టీడీపీలో సమన్వయ లోపం వైకాపాకు కలిసొచ్చిందా..?

వైఎస్సార్‌సీపీ విజయానికి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల సమష్టి కృషి ఒక కారణమైతే, మరోవైపు తెలుగుదేశం పార్టీ నాయకుల మధ్య సమన్వయ లోపం కూడా వైకాపాకు కలిసొచ్చిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా పెద్ద జూటూరుకు చెందిన మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ తగుంట్ల రాఘవరెడ్డి ఎన్నికల ప్రక్రియకు దూరంగా ఉండటంతో పాటు పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనకపోవడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.టీడీపీ నాయకుల మధ్య ఆశించిన స్థాయిలో ఐక్యత, సమన్వయం లేకపోవడం వల్ల పార్టీ ఎన్నికల ప్రచారం, ఓటర్ల సమీకరణపై ప్రభావం పడిందని కొందరు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. నాయకుల మధ్య సమన్వయం కొరవడటం, క్షేత్రస్థాయిలో కార్యకర్తలను సమర్థవంతంగా నడిపించలేకపోవడం కూడా ఫలితాలపై ప్రభావం చూపి ఉండవచ్చని స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

వేముల రాజకీయాల్లో విజయంపై ఆసక్తికర చర్చ..!

మొత్తంగా నాగేళ్ల సత్యప్రభావతమ్మ సాధించిన 1,569 ఓట్ల మెజారిటీ విజయం వేముల మండల రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. వేల్పుల రాము ఎన్నికల వ్యూహాలు, నాగేళ్ల సాంబశివరెడ్డి నాయకత్వంలో పార్టీ శ్రేణుల సమన్వయం, ఇతర నాయకులు, కార్యకర్తల కృషి ఈ విజయానికి దోహద పడినట్లు వైఎస్సార్‌సీపీ వర్గాలు పేర్కొంటున్నాయి. మరోవైపు టీడీపీలో అంతర్గత సమన్వయంపై చర్చ మొదలైంది. ఈ ఎన్నికల ఫలితాలు రానున్న రోజుల్లో వేముల మండల రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయన్నది స్థానికంగా ఆసక్తికరంగా మారింది.

నిడదవోలులో కూటమి ప్రభంజనం

- 62 ఎంపీటీసీలకు 54 స్థానాల్లో విజయం
- ప్రజాస్వామ్య విజయానికి నిదర్శనం: మంత్రి కందుల దుర్గేష్



నిడదవోలు, మన జనప్రగతి, నవంబర్ 07:- స్థానిక సంస్థల ఎన్నికల్లో నిడదవోలు నియోజకవర్గంలో కూటమి ఘన విజయం సాధించిందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. నిడదవోలులోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉండ్రాజవరం, పెరవలి, నిడదవోలు మండలాల్లో కూటమి అభ్యర్థులు మెజారిటీ స్థానాలను కైవసం చేసుకున్నారని తెలిపారు.నియోజకవర్గంలోని మొత్తం 62 ఎంపీటీసీ స్థానాలకు గాను 54 స్థానాల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించారని వివరించారు. ఇందులో టీడీపీ 29, జనసేన 24, బీజేపీ ఒక స్థానాన్ని గెలుచుకున్నాయని తెలిపారు. మూడు జెడ్పీటీసీ స్థానాలను కూడా కూటమి కైవసం చేసుకుందని పేర్కొన్నారు. విజయం సాధించిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులను మంత్రి అభినందించి సత్కరించారు.కూటమి నేతల సమిష్టి కృషి, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు ఉన్న నమ్మకమే ఈ విజయానికి కారణమని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై ప్రజలు విశ్వాసం ప్రకటించారని పేర్కొన్నారు.మరోవైపు తుఫాన్ల కారణంగా నష్టపోయిన ప్రజలకు ఎన్నికల ప్రచారం కంటే సహాయక చర్యలకే ప్రాధాన్యం ఇచ్చామని తెలిపారు. తుఫాన్ సమయంలో ప్రజలకు అండగా నిలవడంలో వైసీపీ నాయకత్వం విఫలమైందంటూ విమర్శించారు.రాబోయే సర్పంచ్ ఎన్నికల్లోనూ కూటమి ఇదే విజయాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు. దీపావళి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, నిడదవోలు నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని మంత్రి తెలిపారు.

శాప్ చైర్మన్ రవి నాయుడును కలిసిన నూతన కార్పొరేటర్లు

- పులిగోరు మురళీకృష్ణారెడ్డి నేతృత్వంలో నలుగురు కార్పొరేటర్ల మర్యాదపూర్వక భేటీ



తిరుపతి, మన జనప్రగతి, నవంబర్ 07:- ఇటీవల జరిగిన తిరుపతి కార్పొరేషన్ ఎన్నికల్లో టీడీపీ సీనియర్ నాయకుడు, తిరుపతి కోఆపరేటివ్ బ్యాంక్ మాజీ చైర్మన్ పులిగోరు మురళీకృష్ణారెడ్డి నేతృత్వంలో విజయం సాధించిన నలుగురు నూతన కార్పొరేటర్లు శాప్ చైర్మన్ రవి నాయుడును శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా రవి నాయుడును శాలువాతో సత్కరించి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. 22వ డివిజన్ కార్పొరేటర్ ఈతమాకుల హేమంత్ కుమార్ యాదవ్, 41వ డివిజన్ కార్పొరేటర్ నసీమున్నిసా, 42వ డివిజన్ కార్పొరేటర్ గంజి సుధాకర్ రెడ్డి, 43వ డివిజన్ కార్పొరేటర్ అనిత ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.టీడీపీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకంతో నాలుగు డివిజన్లలో అభ్యర్థుల విజయానికి పులిగోరు మురళీకృష్ణారెడ్డి కృషి చేశారని పార్టీ నాయకులు కొనియాడారు. క్లస్టర్-3 పరిధిలో పార్టీ బలోపేతానికి ఆయన చేస్తున్న కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174